అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

140

ఆగస్టు 1992

2

విషయసూచిక

సంపాదకీయం :

అవును, మారటోరియం అవసరమే 3

కవితలు :

రాచపుండు — కో.ప్ర. 5

నిషేధ కవిత — టి. స్పార్టకస్ 10

స్వాతంత్ర్యమా నీవెక్కడ ? — టి.వి. 10

పాదస్పర్శా పులకింత — రాప్తాడు గోపాలకృష్ణ 11

స్వచ్ఛత — యమ్.యస్.ఆర్. 12

కథ :

దగ్ధం — ఆర్. శశికళ 13

ధాత్రిని ఎవరినుండి కాపాడాలి ? — కె. అనూరాధ 21

స్త్రీ సమస్య పట్ల అవగాహన సమగ్రంగానే ఉందా ? 27

— సహచరిణులు

కథనం :

కొండవాగు — పెద్దన్న 34

అరుణతారక

రచనలు, చందాలు, విరాళాలు పంపవలసిన అడ్రసు

వి. చెంచయ్య

6-5-13, కావలి - 524 201

నెల్లూరు జిల్లా (A.P.)

KLVA1061

సంపాదకీయం :

అవును, మారటోరియం అవసరమే!

భారతదేశంలోని అన్ని సమస్యలకూ ఏకైక పరిష్కారంగా మూడేళ్ళపాటు 'మారటోరియం' ప్రకటించడమే అన్నాడు ప్రధాన మంత్రి. ఆయన దృష్టిలో ఇది సర్వరోగ నివారిణి. మూడేళ్ళపాటు ఏ సమస్యపైనా ఎవరూ మాట్లాడకుండా, నిరసన తెలియజెయ్యకుండా, ప్రదర్శనలూ, సమ్మెలూ, పోరాటాలూ చెయ్యకుండా చుక్కిన పేనుల్లాగా పడివుంటే ఆ సమస్యలు పరిష్కారమార్గంలోకి వస్తాయని ఆయన ఉద్దేశం. అంటే అన్ని రకాల నిరసనలపైనా, సమ్మెలపైనా, పోరాటాలపైనా నిషేధం అన్నమాట. నిషేధం అన్నమాట అభ్యంతరకరంగా కనిపించవచ్చుగానీ, మారటోరియం అన్నమాట దేశ 'అవసరాల' దృష్ట్యా మంచిదే అనిపించవచ్చు. అందుకే ప్రధానమంత్రి ఆగస్టు 15న ఈ తారకమంత్రాన్ని ఉపదేశించాడు.

ఆగస్టు 15 భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజట! ఈ దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలన అంతమైన రోజట! శాంతియుతంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్న రోజట! అంత 'మంచి' రోజున ఇంత 'మంచి' మాట చెప్పిన ప్రధానమంత్రి ఎంత 'మంచి' వాడో గదా అని కొందరైనా అనుకోనుండవచ్చు.

"ఆగస్టు 15 ద్రోహాన్ని చెప్పకపోతే అన్నం సహించదు నాకు" అన్నాడు విప్లవకవి చెరబండరాజు. మొన్న ఆగస్టు 15 నాటికి ఆ ద్రోహం జరిగిపోయి నలభై అయిదు సంవత్సరాలైంది. ఇన్నేళ్ళ తర్వాత వివాదాస్పద సమస్యలపై మారటోరియం ప్రకటించడం మంచిదనుకోవడం పాలకులు చేస్తున్న అనేక ద్రోహాల్లో మరొకటి అవుతుంది.

సమస్యల్ని పరిష్కరించలేనివాడికి ఆ సమస్యలపై మాట్లాడవద్దని అనడం తప్ప వేరే మార్గం లేదు. ఎంత మాట్లాడినా సమస్యలు

పరిష్కారంకాని ఈ రోజుల్లో ప్రజలు పోట్లాడ్డానికయినా సిద్ధపడుతున్నారు.

నలభై అయిదేళ్ళ "స్వతంత్ర" పాలనలో మన పాలకులు ఒక్క సమస్యనైనా పరిష్కరించారా ? పరిష్కారం మాట అలావుంచి ఎన్ని సమస్యల్ని సృష్టించలేదు ! ఏమయినా మన పాలకులు గొప్ప "సృష్టికర్తలు" !

అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, నిరుద్యోగం, కరువు, ఆకలి మొదలయిన సమస్యల తోరణాలతో విరాజిల్లుతున్న మన ప్రజాస్వామ్యానికి పి.వి. నరసింహారావుగారి మారటోరియం ఒక్క శిరోమణి వంటిదే !

సెక్సు సాహిత్యంపైనా, బూతు సినిమాలపైనా మారటోరియం అక్కర్లేదు ? వందలవేల కోట్ల కుంభకోణాలపైన ఏ చర్యలూ అవసరం లేదు ? సారాయి వంటి మత్తు పదార్థాల్ని అమ్ముకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని ఫణంబెట్టి డబ్బు సంపాదించే ప్రభుత్వ అక్రమ విధానాలపైన ఆంక్షలు అవసరం లేదు ? విద్యను వ్యాపారంగా మార్చే పాలన వ్యాపార సంస్కృతిని నిషేధించనక్కరలేదు ! పై సమస్యలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తే నిషేధం ! ప్రాణాలైనా కాపాడుకుందామనే ప్రజల ప్రయత్నంపై మారటోరియం !

ఇప్పుడు ఏ విషయంలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఉన్నాయి గనక, కొత్తగా మారటోరియం విధించడానికి ! పోలీసు లాకప్ డెత్తుల్లో ఎందరు అమాయకులు ప్రాణాలు పోగొట్టుకోలేదు ! బూటకపు ఎన్‌కౌంటర్లలో ఎందరు విప్లవ కార్యకర్తలు అమరులు కాలేదు ! మరెందరు చిత్రహింసలకు గురికావడం లేదు ! ఎందరు యువతీ యువకులు నిరుద్యోగ రక్కసికి బలి అవడం లేదు !

అవును, మారటోరియం అవసరమే ! ఈ దోపిడీ వ్యవస్థ కొనసాగింపుపై ఏదో ఒకనాడు ప్రజలు మారటోరియం విధిస్తారు !

రాచపుండు

శ్రమ సరుకై
ఉత్పత్తి ఆదాయమై
శ్రమ జీవినుండి శ్రమ ఫలితం
వేరుచేయబడింది
వెలకట్టబడింది
పని విభజన అవసరమై
కులవిభజన 'అనివార్య'మైంది
ఊరూ-వాడా
ఉత్తర-దక్షిణమంత వ్యత్యాసమైంది
నింగీ-నేలా అంత వేరయింది
బొమ్మా-బొరుసూ అంత తేడా అయింది
చీకటీ-వెలుగూ అంత భేదమైంది
ఏకం చేయాలన్నదెవడు
ఎలుగెత్తి చాటిందెవడు
అవును! నేనిపుడు కులం గురించే
మాట్లాడుతున్నాను
'మడి' లేదు - గుడి లేదు
గుడిలో లింగామూ లేదు
దేవతా, దెయ్యమూ లేదు
ఉన్నదంతా
కాసుకూ-కష్టానికీ మధ్య
కత్తులు దులిపే కయ్యమే
నీ రంకు రామాయణమైంది
బొంకు భారతమైంది
వ్యూహం దైవమై
ఎత్తుగడ మనువై
మా తనువంతా నెత్తుటి చిత్తడయింది
అవమానాల సుడిగుండమైంది
ముసుగు లాగిందెవడు
మర్మం తెలిపిందెవడు
చూపును విశాల పరుచుకొని
కుల దురహంకారాన్ని
కూకటివేళ్ళతో పెకలించాలని
కంకణం కట్టుకొందెవడు
కత్తుల కోలాటమాడుతుందెవడు
రాజులు లేనినాడు
రాజ్యాలు లేనినాడు
స్వంత ఆస్తి ఊసే లేనినాడు
కులమా! నీ చిరునామా ఎక్కడ
కులం నీరై కారంచేరయింది
కులం ఓపై పొదిరికుప్పమైంది
కులం అణచివేతై చుండూరయ్యింది
కులం కామమై పుత్తవ్వయ్యింది.
కులం మనిషై మనుషుల్ని దోచింది
కులం దైవమై దేశాన్ని ముంచింది
రంగు మార్చుకొని రామజన్మభూమై
రంగంమీది కొచ్చింది
పరిధీ, పరిణామం పెరిగి
జాతి అయ్యింది
జాతీయ దురహంకారమైంది
ఎల్లలులేని దోపిడీ అయింది
ఎనలేని దౌర్జన్యమైంది
ఎదురొడ్డి నిలిచిందెవడు
యుద్ధం ప్రకటించిందెవడు
నేరానికి శిక్ష నేరాన్నిబట్టిగాక
కులాన్ని బట్టి ఎందుకైంది
కామానికి పనికొచ్చిన నా తల్లి
కాపురానికెందుకు చెల్లనిదైంది
ఒకే నీరు నీ దప్పిక తీర్చి
నా అంగిలెందుకు ఎండగొట్టింది

ఒకే ఊరు నిను అక్కున జేర్చుకొని
నన్ను అంటరానివాడని ఎందుకంది
ఒకే పనికి ఫలితం కష్టాన్నిబట్టిగాక
కులాన్నిబట్టి ఎందుకు నిర్ణయించబడింది
ఒకే అర్థానికి భాష
కులాన్ని బట్టి ఎందుకు మారింది
ఒకే నేరానికి శిక్ష
కులాన్నిబట్టి ఎందుకయింది
పేగులుండచుట్టుకుపోయే గతం నాది
నరాలు చిట్లే నరకం నాది
అక్కున జేర్చుకొందెవడు
ఓదార్చిందెవడు
కులం నీకు ఆర్థికమై
ఆయుధమై, అధికారమై
నీ ఉత్పత్తి
వెలలేని ముడిసరుకెలా అయింది
నీ ఆదాయానికి హామీ ఎలా అయింది
ఆదే కులం-నా కంట్లో కారప్పొడై
అరికాల్లో కరతుమ్మముల్లై
నద్దిబువ్వలో లొద్ది పురుగై
నా బతుకులో బుడ్డపింజెరై
ఎందుకు పారాడుతుంది
చెట్టూ, చేమకు లేని కులం
గొడ్డూ, గోదకు లేని కులం
పశువులకు లేని కులం
పశువుల పంచితానికి లేని కులం
మృగాలకు లేని కులం
మనుషుల కెందుకంటుకొంది
అగ్రకుల దురహంకారమా
బదులుపలుకు
కాసునోడికి కూలోడినై
కులమునోడికి అంటరానోడినై
అతలాకుతలమైంది నేను
అడుగంటిపోయింది నేను
గోడదెబ్బ - చెంపదెబ్బ రెంటూ తగిలి
గోడు గోడు మంటూ
గుండెలు బాదుకొంది నేను
గుదిబండలు మోస్తుంది నేను
మీ కయ్యల్లో పంటై పండి
కవళానికి ఎండి
మీ కాళ్ళకు చెప్పునై అమరి
నా అరికాళ్ళ బొబ్బలెక్కించుకొని
మీ వొంటి నిండాగుడ్డకప్పి
వివస్త్రనై ఊరేగుతూ
దేవుడా! ఏ జన్మలో చేసుకొన్న పాపంరా
నాయనా ఇదని
దిక్కులాలకించింది నేను
దేబిరించింది నేను
దారీ-తెన్నూ లేక
దద్దమ్మనై తలాడించింది నేను
స్వయంపోషక గ్రామీణ వ్యవస్థకు
నిను మకుటం లేని మహారాజునుచేసి
మాడి సచ్చింది నేను
నీ కీర్తి దిగంతాలకు ఎగబాకించి
పాతాళానికి దిగబడింది నేను
ఏకలవ్యుని త్యాగం నాది
శ్రీరామచంద్రుని కపటం నీది
మీ బిడ్డలకు బొడ్డుకోసి, భూమ్మీదకు తెచ్చి
ఉచ్చా, పియ్యా ఎత్తేసి, వొంటికి నీళ్ళు బోసి
ఉగ్గబట్టి ఏడుస్తుంటే
నా వొంటి నరాలు మీటి
జోల పాడి ఏడుపాపింది నేను

మీ చంటి బిడ్డలను నా చేతుల మీదుగా
చెట్టంత ఎదిగిచ్చింది నేను
సత్తువయ్యింది నేను
నీ తల్లి చస్తే చావు కబురు మోసింది నేను
పాడె కట్టింది నేను
'కట్టె' కాష్ఠాన కాల్చి కడతేర్చింది నేను
నా ఊర్లో నా పేరు అలబరి
నా దేశంలో నా పేరు కూలి
నే ననాదిగా ఆలబరోడ్ని
పునాదిలేని బానిసని
తరతరాల అవమానాల
ఆవేదన నాది, ఆవేశం నాది
ఆక్రోశం నాది
నే మాటాడితే నాలుక కోసి
వింటే చెవిలో సీసం పోసి
చూస్తే కళ్ళు పొడిచి
నన్ను వెలివేసిందెవడు
నా బతుకుకు వెలకట్టిందెవడు
నన్ను బడికి దూరం చేసి
మెదడుకు దడికట్టి
'మడి'కి బందీ చేసిందెవడు
నా తెలివితేటల్ని దోసి
కడుపునింపే కాయకష్టాన్ని
జ్ఞానం కాదు పొమ్మన్నదెవడు
గుర్రాలకు గుగ్గిళ్ళు పోసి
ఎద్దులకు పచ్చగడ్డేసి
కుక్కలకు కూడొండి పెట్టి
కూడుపెట్టే కూలోడి కడుపు మాడ్చిం
దెవడు

మొలకు ముంత కట్టి
ముడ్డికి తాటాకు కట్టి
చేతికి చీపురిచ్చి
ఛీ....ఛీ.... ఆవల, ఆవల,
దూరం, దూరం- అంటూ
మదమెక్కి పలికిందెవడు
రంగు భేదం చూపి
రక్తాలు కక్కిస్తున్నదెవడు
జాతుల సంపద దోచుకొనేందుకు
దోబూచు లాడుతున్నదెవడు
నా దేశపు జాతుల పోరాటాల్ని
రక్తపుటేరుల్లో ముంచి
అంతర్జాతీయ జాతుల ఉద్యమాలకు
సంఘీభావం తెలుపుతున్నదెవడు
సామ్రాజ్యవాదంలో
గొంతులోతు కూరుకుపోయి
గోతులు తీస్తున్నదెవడు
న్యాయమైన జాతుల విడిపోయే
హక్కును
విద్రోహంగా చిత్రిస్తున్నదెవడు
విషం చిమ్ముతున్నదెవడు
చుండూరుకు కారణభూతుడై
'బారా'ను తప్పుబడుతున్న దెవడు
కన్నతల్లి కడుపులోనే
కులం అంటురోగాన్ని
మా కంటగట్టటం ఎవడి కుట్ర
కల్లాకపటం తెలియని పిరుప్రాయంలో
కులం శిలువను మా భుజాలకెత్తటం
ఎవడి ద్రోహం
ఏలెడంతలేని రెడ్డి కొడుకు
ఎనభై ఏళ్ళ మా తాతను
'ఒరే ఎంగిటిగా ఇట్రారా'
అని పిలవటం వెనుక
ఎవడి వత్తాసుంది
'మాదిగ పొందోడూ, మాల కొండడూ

చాకలి కిష్టడూ' అంటూ
కులంతో మనిషిని పోల్చి
కులంలో మనిషిని కుదించి
మా వ్యక్తిత్వాన్ని కూల్చటం వెనుక
మూలమేమిటి
రెడ్డి భూస్వామై, భూస్వామి రెడ్డై
దొర కమ్మై, కమ్మ దొరై,
రెండు తలల విషసర్ప మవటంలోని
మతలబేమిటి
అమ్మా ! అమ్మా ! ఆలీసమ్మా !
ఎక్కడ తల్లీ నువ్వెక్కడ
కరకు కత్తుల కారంచేడు కమ్మ దొరల్ని
కరకర కొయ్యాలని నినదించిన
నీ కంఠ మెక్కడ
నువ్వేసిన పొలికేకతో
గొంతు కలిసి పిలుస్తున్నాను
ఎక్కడ తల్లీ! నువ్వెక్కడ
పేగుతెంచి, రక్తాన్ని పంచిన నా తల్లీ
నా బాకీ అణాపైసల్‌తోసహా తీరేదెప్పుడు
నీ కసి తీరేదెన్నడు
శ్రమ నిష్ఫలమై, తీరని అవమానమై
అవమానం, ఆలోచనై
ఆలోచన ఆయుధమై, ఆచరణై
అడుగు కదిల్చిందెవడు
నేలనా తల్లి అని
మానవుడు నా నేస్తమనీ ప్రకటించిం
దెవడు
కులాన్ని అర్థం చేసుకుని
అవగాహన పెంచుకొందెవడు
కులం వర్గంలో అంతర్భాగమని
తెలుసుకొందెవడు
తెగేసి చెప్పిందెవడు

గాయాలు రెండూ-మందొకటే అయినట్టు
కులం వర్గానికి కలిపి
పరిష్కార మొక్కటేనని
ప్రకటించిందెవడు
కారంచేడుకు కరీంనగరే
ఏకైక మార్గమని
నిజాన్ని పలికిందెవడు
నినదించిందెవడు
అమ్మా ఆలీసమ్మ ఆశకు బాసై
బానకు శ్వాసై
సాయుధ మయిందెవడు
సాగిపోతున్న దెవడు
దారితప్పిన కుల చైతన్యానికి
చుక్కాని అయ్యిందెవడు
చూపై గమ్యాన్ని చూపిందెవడు
అది నువ్వు కాదు
నీ తొత్తూ కాదు
అది సత్యమన్న
సారంగపాణి
సహదేవుడు
సముద్రుడు
మనిషికి పుట్టిన నన్ను
మనిషిగా పుట్టిన నన్ను
మనిషిగా బతకాలనుకొన్న నన్ను
దేవుడి బిడ్డను చేసి
ద్రోహానికి వొడి గట్టినవాడు
జాతిపిత అయిన దేశంలో
నా ఆర్తనాదం
రఘుపతి రాఘవ రాజారాం అయింది
నా గుండెకోత కన్నీటి సంద్రమైంది
కులం పునాది నీ కుట్రలో వుంది
కుతంత్రంలో వుంది

అసత్యంలో వుంది
అధికార దాహంలో వుంది
దిగపడనివాడికి కులంలోతు మోకాట్లోతే
దిగపడ్డవాడికి అగాధం
అంటరాని కులపోడిసన్న
మూర్ఛబిళ్ళ మెడకు తగిలించుకొని
కులాన్నడ్డం పెట్టుకొని
కుట్ర పన్నుతున్నదెవడు
కపట నాటకమాడుతున్నదెవడు
కుల చైతన్యానికి
మసిబూసి మారేడుకాయ జేసి
మతలబు చేస్తున్నదెవడు
'పాడిందేపాడరా పాసిపళ్ళ దాసరీ'.
అన్నట్టు

వున్న కులానికి పునాది మరచి
రాని పరిష్కారానికై రాగాలు దీస్తున్న
దెవడు

రంకె లేస్తున్నదెవడు
ఎండమావిలో నీళ్ళకోసం దేవులాడినట్టు
కుల సమస్యకు పరిష్కారాన్ని
కోర్టుల్లో వెతుకుతున్నదెవడు
కళ్ళకు గంతలు కడుతున్నదెవడు
తలనుండి మొండేన్ని వేరుచేసినట్టు
వర్గంనుండి కులాన్ని వేరు చేస్తున్నదెవడు
మొండెమే శరీరమన్నట్టు
కులమే వర్గమంటున్నదెవడు
వాస్తవాలను వక్రీకరిస్తున్నదెవడు

వంచిస్తున్నదెవడు
కారంచేడులో గాల్లో యుద్ధంచేసి
చుండూరులో శిఖండై తేలిపోయిందెవడు
వాడు మీ ధనికవర్గ కుతంత్రాలకు పుట్టిన
అక్రమ సంతానం
రూపం మాది
రుచులు మీవి
తీగలాగితే డొంకంతా కదలినట్టు
కులం విల్లును
వర్గం ధనస్సు మీంచి ఎక్కుపెడితే
నీ కుర్చీ కదిలింది
రంగూ, రుచీ, రూపం లేని కులం
చిరునామా తెలియని కులం
మా చిరునామాలను నిర్ణయించటం
ఇకపై చెల్లదని
ఈ బద్మాష్ వ్యవస్థ భస్మానికై
బిగిసి నిల్చి బందూకెత్తిన
బాలన్ రాజన్ నాగేశన్నల
నెత్తురు తడిసిన జెండానెత్తి
కంచికచర్ల కోటేశన్న
ఆర్తనాదానికి బాణీకూర్చి
ఖూనీకోరుల రాజ్యం మీదికి
కాలిదండై కదలబారిన
బడుగు జీవుల బతుకుల్లో రగిలే
కల్లోలానికి కళ్ళు తెరిచిన
కరీంనగర్ నా వెన్ను
దండకారణ్యం నా దన్ను

9-8'92

— కో. ప్ర.

నిషేధ కవిత

జ్ఞానాన్ని నిషేధిస్తావా ?
గానాన్ని నిషేధిస్తావా ?
జ్ఞాపకాన్ని నిషేధిస్తావా ?
ఆశయాన్ని నిషేధిస్తావా ?
అమరత్వాన్ని నిషేధిస్తావా ?
బంధించట మసంభవమని
సముద్రం పై నిషేధమా ?
కళ్ళు మూసుకొనగానే
సూర్యుని పై నిషేధమా ?

ఆకలన్న పాపానికి
అడవిపైన నిషేధమా ?
చీకటిని ఓర్వలేదని
నక్షత్రాలపై నిషేధమా ?
అయినా
సూర్యోదయ మాగదని
నీ పరాజయం తప్పదని
చెప్పే వర్గపోరు చరిత్రను
ఎలా నిషేధిస్తావు ? !

—స్పార్టకస్

స్వాతంత్ర్యమా నీవెక్కడ ?

ఆగస్టు 15
అందమైన శూన్యం
అంధకారంలో చేతులు
మారిన అధికారం
అది అసురుల స్వర్గం
చీకటి ముసిరిన వెలుతురు
అసురులకు సుప్రభాతమే పాడగా
నడి వీధులు సంబరాలతో
అంబరాలు వూరేగగా
తిన్నది అజీర్తి చెందినా
వారసత్వం కోసం
ప్రజాస్వామ్యమా వర్థిల్లాలంటూ
మైకులు కేకలు వేస్తున్నాయ్
స్వాతంత్ర్య పాలన
స్వార్థ పాలనై
రత్నాలను కన్న రత్నగర్భ
నిరుద్యోగుల్ని కంటుంటె
అన్నం పెట్టిన అన్నపూర్ణ
ఆకలితో విలపిస్తున్నది
ధరలు అంతరిక్షంలో చుక్కలై
భూమిని వెక్కిరిస్తున్నాయ్
దౌర్జన్యం ఎయిడ్స్‌లా వ్యాపించి
చుండూరులో మర్డర్లు చేసి
ధర్మవరంలో మానభంగం చేసింది
రాజ్యకాంక్ష రాజ్యహింసగా మారి
ఎన్‌కౌంటర్ చేస్తున్నది
ప్రజాస్వామ్యం నగ్నంగా
అసురుల ముందు నృత్యం చేస్తుంటే
స్వాతంత్ర్యమా నీ వెక్కడ ?

టి. వి.

పాదస్పర్శా పులకింత

పుష్పపరిమళాల కోసం తనువంతా తడుముకుంటుంది భూమి
బ్రహ్మజెముడు ముళ్ళు గుచ్చుకుంటాయ్
రక్తసిక్త గాయంతో తల్లడిల్లిపోతుంది
ఒక సుట్రగాలి పోలీస్ రైడింగ్‌లో నెత్తురు కక్కుతూ నేల రాలుతుంది
దుమ్ముపట్టి చినిగిపోయిన దినపత్రిక ముక్క
ఎండిపోయిన పిచ్చిమొక్కకి తగులుకొని రెపరెపలాడుతుంది
జీవితాన్ని నేయలేక మగ్గాలు శవాల పాడెలౌతాయి
దిశమొలలతో పిల్లలు పాపచ్చికాయల్లో ఆకలిని వెదుక్కుంటారు
వెతల బ్రతుకు భారమై తనకు పట్టిన గ్రహణం గ్రహించలేని మనిషి
పిడికెడు మట్టిని దిష్టి తీసుకుంటాడు
పొదుగు ఎండిన ఆవు ఒకటి మట్టిని నాకుతూ
మట్టినే నమ్ముకోమని లేగదూడకు నేర్పిస్తుంది
అంగళ్ళు ఆకాశంలో తేలుతూ పోతాయి
కోకలంటుకున్న కమురువాసన గాల్లో కలిసిపోతుంది
మీసాలు దువ్వుకుంటూ ఖద్దరు సర్దుకుంటూ దుమ్ము లేపుకుంటూ
పట్టణం వేపు పరుగుతీస్తుందొక జీపు
మృత్యురసాన్ని పాకెట్లలో నింపుకొని
పల్లెలో కొస్తుంది రాజముద్రికా శకటమొకటి
తుపాకులు వేలాడదీసుకొని పాటలు పాడుకుంటూ
చీకట్లో వెలుగుమొక్కలు నాట్లేస్తూ నడిచిపోతుంది దళం
వాళ్ళు నడిచినంత మేరా భూమి పులకించిపోతుంది

—రాప్తాడు గోపాలకృష్ణ

స్వచ్ఛత

పసిపాప !
ఇప్పుడే పుట్టాడు
ఎంత తడిగా ఉన్నాడో !
నన్ను నేను మట్టుకోని పోల్చి చూసుకున్నాను
నాకు దిగులు ముంచుకొచ్చింది !
చిన్న చిన్న వేళ్ళతో నా నుదురు స్పృశించాడు
నిలువెల్లా చమట చమట అయిపోయాను !
పెదవులను నా చెంపకు అన్చాడు
ఆ విద్యుత్తు తట్టుకోలేకపోయాను !
క్షణక్షణం నా చేతుల్లో వాడి బరువు పెరుగుతోంది
సవినయంగా సంపూర్ణంగా ఆత్మవిమర్శ చేసుకున్నాను !
చిట్టి చిట్టి పాదాలు నా గుండెల్లో దించి
నా గుండె గది మూలల్లో దాగిన మురికిని శుభ్రపరిచాడు
ఒంట్లోకి చేరిన కొత్త రక్తంతో
"ఒరే కన్నా నీతో
స్వచ్ఛతలో పోటీపడి ఎన్నటికయినా ఓడిస్తాను" అని సవాల్ చేసాను
నేను మళ్ళీ ప్రజల్లోకి !
ప్రజాయుద్ధంలోకి !!

—యం. యస్. ఆర్-మే 24 '92

స్వేచ్ఛ

ఎక్కడున్నవు నీవు పేదబోయినవు
పేదమూచినగాని పేదకే నీవు
అమ్మదొంగా నీవు ఆడ ఉన్నవులె
అధికార్ల పాదాల అలోకమందు.

— మానుకొండ నాగేంద్రప్రసాద్

కథ

దగ్ధం

స్కూల్‌కు పోతూ మధ్యలో ఆగి ఏదో గుర్తొచ్చినట్టు హడావిడిగా ఇంటికి వచ్చాడు ప్రభాకర్. ఇంట్లోకి అడుగుపెడుతూనే "అమ్మా ! నిన్ననే చెప్పినానే, ఈ రోజే ఫీజు కట్టాల్సింది ఆఖరని, ఈ రోజు కట్టాలి, లేకుంటే పరీక్ష రాయనివ్వరు" అన్నాడు.

లక్ష్మమ్మ గుండెల్లో రాయి పడింది. అయినా ఏదో ధైర్యంతో "మధ్యాన్నం తిండి కొచ్చినపుడు తీసుకపోదువులే నాయనా, ఎవ్వరి తావునన్నా అడిగొస్తా" అంటూ అప్పటికి సర్ది పంపింది.

ఉదయం ఎనిమిదిన్నర అవుతోంది. ఇల్లు దూరం కాబట్టి తొందరగా స్కూల్ కెళ్ళేందుకు బయటపడ్డాడు. ప్రభాకర్ పొట్టి శ్రీరాములు మున్సిపల్ స్కూల్‌లో పదవతరగతి చదువుతున్నాడు. హాస్పిటల్ వెనుకనే ఉన్న అరవింద నగర్ కాలనీకి చెందిన చిన్నపాటి గుడిసెలు చాలా వున్నాయి. అక్కడే రోడ్డుకాను కొని ఉన్న ఓ చిన్న పెంకుటింట్లో ఉంటున్నారు ప్రభాకర్ తల్లిదండ్రులు. ప్రభాకర్ తండ్రి సుందరయ్య పట్టుపరిశ్రమ శాఖ ఆఫీసులో ప్యూన్‌గా పనిచేస్తున్నాడు.

రాత్రి నిషా ఇంకా దిగినట్టులేదు, బద్దకంగా లేచి కాలకృత్యాలు తీర్చుకొని ఆఫీసుకు బయల్దేరబోతున్నాడు సుందరయ్య.

"ఏమయ్యో ! పిల్లోని ఫీజుకు ఇయ్యాలే ఆఖరి. ఆడ ఈడ తెచ్చి జమచేసిన ఫీజు దబ్బులు గుంజకపోయి తాగొస్తివి. పిల్లోని ఫీజు కట్టాలంటే ఎప్పుడూ కటకట చేస్తావుండావు" లక్షమ్మ కంఠం వణుకుతూ ఉంది. మాటలు పూడుకపోతున్నాయి. నిన్న సాయంత్రం జరిగిన రచ్చంతా మనసులో మెదులుతూనే ఉంది. ఒళ్ళంతా తగిలిన దెబ్బల బాధకన్నా, పిల్లోని ఫీజు భూతంలా భయపెట్టుదా వుందామెను.

"కట్టాంలేవే నీయవ్వ ! కొంపలేం అంటుకుపోలేదులే" అంటూనే ఇంకో మాటకు అవకాశం యివ్వకుండా చెప్పులు తొడుక్కొని విసురుగా బయటికి పోయాడు సుందరయ్య.

లక్షమ్మ అలానే కూర్చుంది. ఆ తెచ్చి దాచిన దబ్బులు ఎట్లా వచ్చినయో తల్చుకుంటూంటే ఆమె కాళ్ళు చేతులు ఆడటం లేదు.

నరసమ్మ వాళ్ళింట్లో డబ్బులడిగినపుడు, వాళ్ళు లోపల మాట్లాడుకునే మాటలు లక్షుమ్మ వింటూనే ఉంది. ఆ తాగుబోతోడుండ్లా - సుందరంగాని భార్య డబ్బు అడగతా ఉంది-బదులంట. ఎట్లిస్తది వద్దులే - ఇంట్లో గొణుగుడు.

అవసరం, నిస్సహాయత ఆమెను అట్లనే నిల్చునేటట్లు చేశాయి. నరసమ్మ బయటికొచ్చి "ఇరవైయుంది లక్ష్మమ్మ వదినా. తొందర్లోనే ఇచ్చెయ్. మా ఆయన గొణుగుతా వుంటాడు" అంటూ చేతిలో పెట్టింది.

ఇంకా ఇద్దరి దగ్గర ఇరవై ఇరవై దెచ్చి మొత్తం అరవై రూపాయలు ఇంట్లో ఆవాల డబ్బాల ఉంచి, కట్టె పుల్లల కోసం వెళ్ళింది లక్ష్మమ్మ. ప్రభాకర్ ఫీజు గురించి ఇంట్లో చెప్పబట్టి అప్పటికి పది రోజులయింది.

సుందరయ్యకు మందు పడక వారం రోజులయితాంది. ఆ రోజు సాయంత్రం ప్రభాకర్ ఇంట్లో లేడు. సుందరయ్య డబ్బులకోసం డబ్బాల్లో గాలిస్తున్నాడు. సరిగ్గా అదే సమయానికి లక్షుమ్మ ఇంటికొచ్చి, ఆమెకు ప్రాణం పోయినట్టయింది. పరిగెత్తినట్టొచ్చి ఆవాల డబ్బాలోని డబ్బు తీసి పట్టుకొంది. డబ్బు సుందరయ్య కంట పడింది.

"పిల్లోని ఫీజు కట్టాలయ్యా !" బతిమాలింది లక్షుమ్మ.

"నీ యవ్వ, ఇట్టియ్యే ! మర్యాదగా చెప్తున్నా" ఇయ్యకపోతే చంపేటట్టున్నాడు సుందరయ్య. అలవాటు పడిన వినోదం కోసం బయటివాళ్ళంతా గుమిగూడారు.

సుందరయ్య కోపం తీవ్ర స్థాయికి చేరింది. ఆమెను జుట్టు పట్టుకొని బాదాడు. చేతిలోనుండి డబ్బు లాక్కొని బయటకు వెళ్ళిపోయాడు. రాత్రి ఒంటిగంటకు తప్ప తాగి తూలుతూ ఇల్లు చేరాడు. ఆ సంఘటన ఇంకా ఆమె గుండెల్లో మంటలు రేపుతోంది.

"ఇప్పుడెట్టా ? ఎవరిత్తారు ? పిల్లోని ఫీజు ఎట్టా కట్టేది? " ఆమె మనసు విలవిల లాడుతోంది. గబగబా వంట ముగించింది. పుల్లమ్మనైనా అడగాలని వెళ్ళింది పుల్లమ్మ భర్త ఓబులేసు ఆసుపత్రిలో వార్డుబాయ్. పేషంట్లను బెదిరించి అయినా మామూళ్ళు లాక్కుంటాడు. అందువల్ల పుల్లమ్మ ఆ వీధిలో వడ్డీలకు అప్పులిచ్చే చిన్నసైజు వడ్డీల మహారాణి అయి పొయ్యింది.

అక్కా అని పిలుస్తూ మెల్లగా తలుపు తట్టింది లక్ష్మమ్మ. పుల్లమ్మ తలుపు తీసింది.

"ఏమే లచ్చి ఇట్టొచ్చినావ్" అడిగింది పుల్లమ్మ.

"అక్కా ! ఓ అరవై రూపాయలుంటే సర్దుతావా ? జీతం ఇంకా పదిరోజుల్లో ఉంది. పిల్లోని పరీక్ష పీజు కట్టాలె. జీతం వస్తానే ఇస్తా" బతిమాలుతున్న ధోరణిలో అడిగింది లక్షమ్మ.

"నాదగ్గరేడియే ! నిన్నుచ్చింటే ఇద్దునుగదా ! మా పెద్దపిల్లోడు పీక్కు-పోయినాడు." అంటూ మొదలుపెట్టింది.

"వస్తా అక్కా" అంటూ లక్షమ్మ బయట కొచ్చింది. ఇంక ఎవర్ని అడగాలో తోచలేదు. ఇంట్లో విలువైనవి ఏమీ లేవు.

లక్షమ్మ అయ్య ఎపుడో ఊరిడిసి వచ్చి అనంతపురంలోనే రిక్షా తొక్కేవాడు. పూర్లో వుండే రెండెకరాలు అమ్మి లక్ష్మమ్మ పెళ్ళి ఘనంగానే చేశాడు. అల్లుడు ఆఫీసులో పని చేస్తాంవాడు. పిల్ల ఒక్కటి. అమాయకురాలు. పెళ్ళప్పుడు ఇచ్చిన కమ్మలు, గొలుసులు, వాచి అన్నీ అయ్య పోకముందే సుందరయ్య తాగుడుకు బలై పోయాయి. లక్షమ్మకు తండ్రి గుర్తొచ్చాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తల్లి ఎట్లుంటాదో గుర్తేలేదు ఆమెకు.

ఇద్దరాడపిల్లలు పుట్టి పోయారు. తర్వాత ప్రభాకర్. అతన్ని కంటికి రెప్పలా చూసుకుంటూ వుంది. ఆమె పట్టుదల మీదనే స్కూలుకు పంపుతోంది.

ఇంట్లో ఏమయినా విలువైనవి ఉన్నాయేమో అని మళ్ళీ ఓసారి చుట్టూ చూసింది. ఏవో ఆశ. ఏమున్నాయి ! చింకి చాపలు, సుందరయ్య కోపాగ్నికి గురై గుంటలు పడిన సత్తు గిన్నెలు తప్ప ఏమీ కనబళ్ళేదు.

మధ్యాన్నం అయ్యేకొద్దీ ఆమెలో ఆత్రుత ఎక్కువవుతోంది. ప్రభాకర్ ఇంటికొచ్చాడు. పుస్తకాలు గూట్లో పెడుతూనే డబ్బుల విషయం అడిగాడు.

"అన్నం తింటవుగాని రారా" అంది లక్ష్మమ్మ.

ప్రభాకర్ అన్నం తినటం ముగిస్తూనే "ఒరే నాయనా, మీ అయ్య ఆఫీసులో వుంటాడు. అడికి పోయి అడుగు. ఎవర్తోనన్నా యిప్పియ్యమను. ఇక్కడ అందర్నీ అడిగిన. ఎవ్వరియ్యలా" అంది.

ప్రభాకర్ సుందరయ్య పనిచేసే ఆఫీసుకు పోయాడు.

అక్కడ సుందరయ్య తీరిగ్గా కూర్చుని బీడీలు కాలుస్తున్నాడు. కొడుకుని చూస్తూనే విషయం అర్థమయింది. అయినా ఏం తెలియనట్లు "ఏంరో ఇట్టొచ్చినవ్" అన్నాడు.

"అప్పా ! పరీక్ష ఫీజు ఇయ్యాలే ఆఖరి. లేకుంటే ఏ పరీక్షకు కూకోనియ్యరు. అమ్మ నీ కాడికి పొమ్మన్నాది, అరవై అడిగి ఇప్పిచ్చుకోమంది" గుక్క తిప్పుకోకుండా చెప్పాడు ప్రభాకర్.

"ఒరే ప్రభాకరా ! స్కూల్‌కు ఆలస్యం అయితాది. నీవుపో. నే నొచ్చి స్కూలు కాడిస్తా" అన్నాడు సుందరయ్య. కాసేపు నిలబడి అపనమ్మకంతోనే అయిష్టంగా కదిలాడు ప్రభాకర్.

మనసు పాతాల మీదికి పోవటంలేదు. తండ్రికోసం ఎదురుచూస్తున్నాడు. ఏ కొంచెం శబ్దం అయినా బయటికే చూస్తున్నాడు.

మధ్యాన్నం రెండున్నర అయింది. కృష్ణారావు గుమస్తా ముందుగా ఆఫీసు కొచ్చాడు. సుందరయ్య ఆయన టేబుల్ దగ్గర వినయంగా నిల్చున్నాడు. అప్పుడప్పుడూ ఐదో, పదో అడగటం అలవాటే.

"ఏం సుందరయ్యా ! ఏం కావాలి ?" అడిగాడు కృష్ణారావు.

"సార్! మా పిల్లోనికి ఫీజు కట్టాలె. ఇయ్యాలే ఆఖరంట. ఓ అరవై రూపాయలు కావాల. మీ దగ్గరుంటే ఇప్పించండి, జీతంలో పట్టుకొందురు" అన్నాడు సుందరయ్య.

"అప్పే ! నా దగ్గర ఇప్పుడు లేదే. టైపిస్టు రాజన్నను అడుగు. నేను చెప్పినానను ఇస్తాడు" సలహా ఇచ్చాడు కృష్ణారావు.

టైపిస్టు రాజన్న ఇంకా ఆఫీసుకు రాలేదు. ఆయన మామూలు టైం మూడున్నర. ఖచ్చితంగా వచ్చాడు. ఆయన చేతిలో బ్యాగ్ విలాసంగా వూగుతోంది. అర్థగంట గడిచాక, లోపల భయంగా ఉన్నా కూడా రాజన్నను అడిగాడు సుందరయ్య. కృష్ణారావు చెప్పినట్టు చెప్పడంతో రాజన్నకు ఇయ్యక తప్పింది కాదు. క్యాలెండరు చూసి, ఓ క్షణం ఆలోచించి, జేబులోంచి తీసిచ్చాడు.

స్కూల్ మూసేస్తారేమోనని గుమస్తా పర్మిషన్ తీసుకొని బయటపడ్డాడు సుందరయ్య.

దారిలో సుందరయ్య మందు ఫ్రెండు నరసయ్య ఎదురయ్యాడు. పక్కనే ఇంకో అతను ఉన్నాడు.

"ఏం మావాఁ ? చాలా రోజులయింది. దరిశనాలే లేవు !" నరసయ్య పలకరించాడు.

"డబ్బుల్లేవురా, మొన్న మా ఆడోళ్ళతో పెద్ద గొడవ జరిగినాది. పిల్లోని ఫీజు వేరే ఆయనతో ఇప్పించుకొని కట్టనుపోతున్నా" అంటూనే ఉన్న విషయం చెప్పాడు సుందరయ్య.

"ఈయన మా బావమరిది. గొందిపల్లినుండి వచ్చినాడు" అంటూ పరిచయం చేశాడు.

ఇంతలో సారామకాణం వచ్చింది. నరసయ్య, ఆయన బావమరిదీ ఆగారు. సుందరయ్య ముందుకు కదిలాడు.

"రా మావాఁ ! ఓ సుక్క ఏసుకోని పోదువు." అంటూ పిలిచాడు నరసయ్య.

"వద్దులేరా, డబ్బుల్లేవు" అన్నాడు సుందరయ్య ఎంతో నిగ్రహంతో.

"నువ్వెన్నిసార్లు నాకు పోపియ్యలేదు ? ఈసారికి నేనిత్తా, రా మావాఁ !" అంటూ బలవంత పెట్టాడు నరసయ్య.

ముగ్గురూ లోపలికి అడుగు పెట్టారు. సుందరయ్యకు ఓ మూల కొడుకు గుర్తొస్తున్నా, స్వర్గంలోకి వచ్చినంత ఆనందం కలిగింది. భూలోకం జాడ మరిచిపోయాడు.

ఇంతలో మట్కా రాసే బాబూరావు అక్కడికొచ్చాడు. చాలామంది అతని చుట్టూ మూగారు. సుందరయ్యపై అప్పటికే సుక్క ప్రభావం పూర్తిగా పని చేస్తోంది. జేబులో డబ్బులు తీసి చేతిలో పట్టుకున్నాడు. అదురుష్టం బాగుంటే ఈ అరవై రూపాయలతో ఆరువేలు వత్తాయి" అనుకుంటూ సుందరయ్య అటువైపు అడుగులు వేశాడు.

తండ్రికోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న ప్రభాకర్‌కు స్కూల్ టైం అయిపోయింది. బెల్ కొట్టేశారు. గంటసేపు గుక్క తిప్పుకోకుండా ఏడ్చి ఏడ్చి, కళ్ళు వత్తుకుంటూ ఇంటిదారి పట్టాడు. బుక్కులన్నీ చించి పడేయాలన్నంత కోపం వస్తోంది. తండ్రిపై కోపం పేరుకొని పోతోంది. గొంతులో ఒకటే మంట.

కొడుకు రూపం చూసి అర్థం చేసుకొంది లక్ష్మమ్మ. ఆమె భర్తను తిడుతూ

కూర్చొంది. ఏం చేయాలో తోచలేదు. రాత్రి 11 గంటలకు ఫుల్ నిషాలో వచ్చాడు సుందరయ్య.

"ఛూ! నీదీ బతుకేనా ? పిల్లోని ఫీజు కట్టకుండా ఏందయ్యా నువ్ చేసేది. ఇన్నాళ్ళు స్కూలుకు పోయింది అంతా అయిపోయింది" చీదరించుకొని ఏడుస్తోంది లక్ష్మమ్మ.

" ఏందే బో పేలుతుండావు ? యాంటికి చదువు ? నీయమ్మ.... అప్లేడస్తావ్? ఈ సుందరంగాడంటే ఏటనుకున్నవ్ ? కలకటర్లు కూడా ఎందుకేనా ముందర ?" మీసాలు మెలేశాడు సుందరయ్య.

"ఇప్పుడు ఆడు పెద్దోడయినాడు. ఇంగ నేను కూడు పెట్టలేనని ఆనితో చెప్పు. సదువంటి సమపు ! లచ్చల డబ్బు వత్తాదే ఎప్పుడో ఒకసారి....అప్పుడు సూడు వీని పఠాపం....సదువు కూడా కొనుక్కుంటా, యా అంగట్లోనైనా దొరుకు తాది" అనుకుంటూ, ఏవేవో గొణుక్కుంటూ నిద్రలోకి జారిపొయ్యాడు సుందరయ్య.

మనుషులు తమ పనులు చేసినా చెయ్యకపోయినా సూర్యుడు తన పని క్రమం తప్పకుండా చేస్తున్నాడు. తెల్లారింది. శోకదేవతలా కూర్చొని వున్న తల్లిని చూస్తుంటే ప్రభాకర్‌కి దిగులు పట్టుకుంది.

"యాందన్న పనికి పోతానమ్మా. నేను సదువుకోనులే ఇంక. నువ్వేం బాధ పడొద్దు" ఓదారుస్తున్నట్టు చెప్పాడు ప్రభాకర్.

ప్రభాకర్ మనసులో తండ్రి పట్ల ద్వేషం, అసహ్యం పెరిగిపోతున్నాయి.

ఆ మరుసటి రోజే వాళ్ళింటి దగ్గరనే ఉన్న మస్తానన్న దగ్గరికి వెళ్ళాడు ప్రభాకర్. మస్తాన్ షెడ్డులో మెకానిక్‌గా పని చేస్తున్నాడు.

"అన్నా ! నేను పని నేర్చుకుంటానన్నా ! నీతోపాటే షెడ్డుకొస్తా" అన్నాడు ప్రభాకర్.

ఆశ్చర్యపోయాడు మస్తాన్.

"ఏం బాబు ! స్కూల్‌కు పోలా ? మీ పరీచ్చలు దగ్గర్లోనే కదా ?" అన్నాడు మస్తాన్. కళ్ళనిండా నీళ్ళు నింపుకొన్న ప్రభాకర్‌ని చూసి ఏమనుకున్నాడో ఏమో "అట్టనేలే" అన్నాడు.

ఇద్దరూ షెడ్డుకాడికి పోయారు. ప్రభాకర్ గురించి ఓనరుకు పరిచయం చేశాడు మస్తాన్. "పది సదువుకోనుండాడు. మంచి తెలివైనోడు" అన్నాడు.

"సదుపుకుండానని సిగ్గాకు వోయ్ ! పని నేర్చుకో ముందు" అన్నాడు ఓనర్ తనకు తెలిసిన భాషలో ప్రోత్సాహంగా.

"రేయ్ ! టీ తీసుకురాపో" ఓనర్ చెప్పేసరికి ప్రభాకర్ టీ కొట్టువైపు నడిచాడు.

ప్రభాకర్ టీ తెచ్చేసరికి చైర్లో కూర్చొని తాపీగా పేపరు చదువుతున్నాడు ఓనర్.

ఆయనకు టీ ఇస్తూ ప్రభాకర్ కళ్ళు పేపర్లోకి గుచ్చాడు ఓ క్షణం. "నక్స లైట్లచే సారా జీపు దగ్ధం" అని ఒక హెడ్డింగు కనబడింది. కళ్ళు పెద్దవి చేసుకుని మళ్ళీ మళ్ళీ చూశాడు. ఆ మాట మనసులో బాగా హత్తుకొంది. ఆ సారాయి వల్ల నే కదా మా అప్ప లాంటోళ్ళంతా పాడయితాంది అనుకున్నాడు. ఎక్కడా సారాయే లేకుండా చెయ్యాలని కసిగా అనుకున్నాడు. 'దగ్ధం' అనే పదానికి అర్థం స్ఫురణకు తెచ్చుకున్నాడు. దగ్ధం అంటే కాలి బూడిద కావడం గదా అనుకున్నాడు. అప్పటి కప్పుడే అందులో రాసిందంతా చదవాలనే ఆరాటాన్ని బలవంతంగా అణచుకున్నాడు ప్రభాకర్.

లారీ సైర్లు కడుగుతూ మస్తాన్‌తో మాటల్లో దిగాడు ప్రభాకర్. "మస్తా నన్నా ! ఓనరు ఇక్కడే ఉంటాడా ? ఆఁయప్ప ఇంటికి పోయేదెప్పుడు ?"

లారీ కింద ఉన్న మస్తాన్ "ఏం ఎందుకూ ?" అనడిగాడు.

"మరి....మరి...." నసిగాడు ప్రభాకర్.

"ఏందో చెప్పవయ్యా బాబూ !" అడిగాడు మస్తాన్.

"ఆయన ఆ పేపరు ఆఫీసులో పెడతాడా ? ఇంటికి తీసుకుపోతాడా ?"

"లేదు, లేదు. మధ్యాన్నం మనకు ఒంటిగంటకు టైముంటుంది. అప్పుడు తీసుకొని చదువుకో" అన్నాడు మస్తాన్ ప్రభాకర్ ఉద్దేశాన్ని అర్థం చేసుకుంటూ.

మధ్యాన్నం ఓనరు ఇంటికి పోయాడు. మస్తాన్, ప్రభాకర్ ఇద్దరూ దగ్గర్లో ఉండే టీ కొట్టుకు వెళ్ళి బ్రెడ్ తిని టీ తాగొచ్చారు.

షెడ్డుకు దగ్గరలో ఓ చిన్న రూముంది. అదే ఆఫీసురూం ప్లస్ ఓనర్‌రూం. ప్రభాకర్ లోపలికి వెళ్ళి పేపరుకోసం వెదికాడు. ఇందాక తనను ఆకర్షించిన వార్త మొత్తం రెండు మూడు సార్లు చదివాడు. పక్కనే బెంచీపైన నడుం వాల్చిన మస్తాన్‌వైపు చూశాడు.

"అన్నా ! సారాయివల్ల డబ్బులు, ఆరోగ్యం రెండూ నష్టమే గదా ? మరి ప్రభుత్వమే ఎందుకు సారాయి అమ్మిస్తాంది ?'' అడిగాడు ప్రభాకర్. మస్తాన్ సమాధానం కోసం ఎదురుచూడకుండానే "నక్సలైట్లు సారాయి జీపును దగ్ధం చేసినారంట" అన్నాడు సంతోషంగా.

"మంచిపని చేసినారు'' అన్నాడు అప్రయత్నంగానే మస్తాన్.

"మరి మంచిపని చేసిన నక్సలైట్లను అరెస్టు చేసినారంట !'' అన్నాడు ప్రశ్నార్థకంగా ప్రభాకర్.

మస్తాన్‌కు సమాధానం దొరకలేదు. అతను పెద్దగా చదువుకోలేదు. ఐదో తరగతితోన్నే అతని చదువు ఆగిపోయింది. కాసేపు బుర్రగోక్కుని "ఏం చేసింద్రంట ?'' అనడిగాడు.

"ఏదో వూర్లో ఆడాళ్ళంతా పోయి సారాయి దుకాణం తీసేమన్నారంట. వాళ్ళు వినలేదంట. కొంతమంది దుకాణంలో దూరి దాన్ని నాశనం చేసినారంట. ఆయన పోలీసుల్ని తెచ్చుకుని మళ్ళీ అమ్ముతుంటే, సారాతెచ్చే జీపును కాల్చేసినారంట నక్సలైట్లు'' సంక్షిప్తంగా వివరించాడు ప్రభాకర్.

"ఎంత మంచిపని చేసినారు !'' అని మళ్ళీ సంతోషాన్ని ప్రకటించాడు మస్తాన్.

ప్రభాకర్ ఆలోచనలో పడ్డాడు.
మౌనంగా పేపర్ మడిచి పక్కన పెట్టాడు.
మస్తాన్ నిద్రలోకి జారాడు.
ప్రభాకర్ మేలుకునే ఉన్నాడు.
అతని ముఖంలో దృఢ నిర్ణయం, పట్టుదల కనిపించాయి.

—ఆర్. శశికళ

ఫార్టీసెవెన్

ఈ దేశంలో దోచేవాళ్ళంతా
నైన్‌టీన్ ఫార్టీసెవెన్ పేరు చెపుతుంటే
దోపిడీకి గురయ్యేవారు
వెతుకుతున్నారు
ఏ.కె. ఫార్టీసెవెన్ ఎక్కడుందని.

21-5-92 — భావన

ధాత్రిని ఎవరినుండి కాపాడాలి ?

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థకు చరమదశ అన్న సత్యాన్ని ఇటీవల జరిగిన ధాత్రి శిఖరాగ్ర సమావేశం మళ్ళీ ఒకసారి రుజువుచేసింది. బ్రెజిల్ రాజధాని రియో డి జెనెరోలో ఐక్యరాజ్య సమితి అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సుమారు 117 దేశాల అధినేతలు, ప్రతినిధులు హాజరయ్యి దాదాపు 12 రోజుల తీవ్ర వాదోపవాదాల అనంతరం భూమిని కాపాడ్డానికి ఒక పథకాన్ని రూపొందించారు.

ధాత్రి శిఖరాగ్ర సమావేశాన్ని పర్యావరణోద్యమ చరిత్రలోనే ఒక గొప్ప విజయంగా పత్రికలు, ప్రభుత్వం ఘోషింపాయి. దాదాపు రెండున్నర సంవత్సరాల తీవ్రకృషి ఫలితంగా జరిగిన ఈ సమావేశం ఎన్నో ఆశలు రేపింది. ఎంతో చర్చని లేవనెత్తింది. చివరికి ఆశలు అడియాసలైనా కొన్ని నిజాలు బయటపడేందుకు ఈ సమావేశం ఉపకరించింది.

ప్రపంచవ్యాప్తంగా ఈ భూమి మీద వున్నటువంటి దేశాలన్నీ భూమిని విధ్వంసం నుండి కాపాడుకోవడం కోసం కలిసి కూర్చుని చర్చించుకోవడం ఆహ్వానించదగిన విషయమే. అయితే ఎవరి మటుకువారు ఎవరి వంతు విధ్వంసాన్ని వారు కొనసాగిస్తూ ఈ సమావేశానికి హాజరు కావడమే విశేషం. అసలు ఐక్యరాజ్య సమితికి ఈ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించాల్సిన అవశ్యకత ఎందుకు ఏర్పడిందో గుర్తించకపోతే ఆ సమావేశ సారాంశాన్ని అర్థం చేసుకోలేం.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాల మధ్య పెరుగుతున్న పోటీ ఫలితంగా, దోపిడీ రెండింతలు అవుతోంది. పీడిత ప్రజలు, భూమి, భూ-వనరులు, భూ-వాతావరణం అన్నీ విపరీతమైన దోపిడీకి గురవుతున్నాయి. తత్ఫలితంగా అంతటా అశాంతి చెలరేగుతోంది. ఎన్నో ఉద్యమాలు తలెత్తుతున్నాయి. ప్రజలు వాళ్ళ హక్కుల కోసం పోరాడుతున్నారు. ప్రజలు తమపై జరిగే దోపిడీనే కాకుండా భూ-పర్యావరణంపై కొనసాగుతున్న దోపిడీని కూడా సమానంగా ప్రశ్నిస్తున్నారు. మూడవ ప్రపంచ దేశాల్లో కూడా పర్యావరణ విధ్వంసాన్ని ప్రశ్నిస్తూ ఎన్నో ఉద్యమాలు తలెత్తాయి. వీటన్నిటి ఫలితమే ఈ శిఖరాగ్ర సమావేశం. ఈ సమావేశం ఏర్పాటుకు ప్రభుత్వేతర సంస్థల (Non-Governmental

Organisations) కృషి కూడా ముఖ్య కారణాల్లో ఒకటి. సమావేశానికి ముందు, వెనకా, సమావేశక్రమంలో ఈ సంస్థలు కొన్ని ముఖ్యమైన విషయాలను చర్చకు పెట్టాయి.

పన్నెండు రోజులపాటు జరిగిన ఈ సమావేశంలో ఉత్తర, దక్షిణ దేశాల మధ్య తీవ్రమైన అగాధం మిగిలిపోయింది. అభివృద్ధి చెందిన సంపన్న దేశాలను ఉత్తరాది దేశాలుగా, అభివృద్ధి చెందుతున్న బీద దేశాలను దక్షిణాది దేశాలుగా గుర్తించడం జరుగుతోంది. సంపన్న దేశాల్లో 20 శాతం మంది ఆర్థిక ఆదాయం 82.7 శాతం వుంటే దక్షిణాది దేశాల్లో అంతే శాతం మంది ఆదాయం 1.4 శాతం మాత్రమే వుందికాబట్టి ఈ అసమానత్వాన్ని నిర్మూలించనిదే పర్యావరణ పరిరక్షణ సాధ్యం కాదని దక్షిణాది దేశాలు గట్టిగా వాదించాయి. ఇన్నాళ్ళుగా భూమిని కలుషితం చేసి అత్యంత దోపిడీకి గురిచేసింది సంపన్న దేశాలే గనక భూమిని శుభ్రపరిచే కార్యక్రమంలో సంపన్నదేశాలే ముందు వుండాలని దక్షిణాది దేశాలు డిమాండ్ చేసాయి. క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో ఈ సందర్భంలో మాట్లాడుతూ, "ఈ రోజున భూమికి తమ పర్యావరణ రుణాన్ని తీర్చుకోవాల్సింది సంపన్న దేశాలే గాని, ఆర్థిక వలసవాదానికీ, సామ్రాజ్యవాదానికీ మధ్య నలిగిపోతున్న బీదదేశాలు ఎటువంటి విదేశీ రుణాల్ని చెల్లించనవసరం లేద"ని అన్నారు.

ఈ రకంగా మూడవ ప్రపంచ దేశాల వారికి మాట్లాడానికి, తమ అభిప్రాయాలు వెల్లడించడానికి ఎక్కువ అవకాశం దొరికిందని పత్రికలన్నీ చాలా ఆశాజనకంగా రాసాయి. దక్షిణాది దేశాల వారి అభిప్రాయాలకి ఈ సారి ఎక్కువ అవకాశం దొరికిన మాట వాస్తవమే. ముఖ్యంగా ఈ విషయంలో ప్రభుత్వేతర సంస్థలు చాలా కృషి చేసాయి. సమావేశం జరగడానికి నెల రోజుల ముందు న్యూయార్క్‌లో జరిగిన ప్రాథమిక సమావేశం (Preparatory Committee meeting) లో ఎన్నో ముఖ్యమైన విషయాలను ఎజెండాలోకి చేర్చడమే కాకుండా చర్చాక్రమాన్ని నిర్ధారించారు. వీరిలో కూడా సంపూర్ణ ఐక్యత లేకపోవడం వాస్తవమే అయినప్పటికీ మొత్తం మీద అవసరమైన విషయాలను మరుగుపడిపోకుండా వెలుగులోకి తెచ్చారు.

ఈ సమావేశం సాధించినవాటిలో చెప్పుకోదగ్గవి రెండు ఒప్పందాలు. మొదటిది జీవజాల వైవిధ్య పరిరక్షణ (Bio diversity) మీద, రెండవది వాతావరణ

మార్పుల(climatic change) మీద. ఈ రెండు ఒప్పందాలకు 153 దేశాలు కట్టుబడి వుంటాయని సంతకం చేసాయి. ఇవి కాక కట్టుబాటు లేని ఒప్పందాలు మూడిటిని కూడా ఎక్కువ దేశాలు ఆమోదించాయి. వాటిలో మొదటిది అడవికి సంబంధించిన సూత్రాల గురించి, రెండవది పర్యావరణ విధానం - అభివృద్ధి సంబంధిత సూత్రాల మీద, మూడవది ఎజెండా-2 అనబడే భవిష్యత్తు కార్యక్రమాల ప్రణాళిక.

వీటన్నిటిలోకి వివాదాస్పదంగా మారిన ఒప్పందం జీవజాలవైవిధ్యానికి సంబంధించినదే. ఈ ఒప్పందం మీద అమెరికా సంతకం చేయలేదు. జీవజాలాలకంటే వ్యాపార ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటున్నామని అమెరికా చాలా నిస్సిగ్గుగా బాహాటంగా ప్రకటించుకుంది. ముఖ్యంగా అమెరికాలో వృద్ధి చెందుతున్న జీవసాంకేతిక (Biotechnology) పరిశ్రమని, దాని మీద ఏటా ఖర్చు అవుతున్న రెండు బిలియన్ డాలర్ల పెట్టుబడినీ దృష్టిలో వుంచుకునే "ప్రపంచ దేశాలన్నీ ఒప్పుకున్నా మేము మాత్రం సంతకం చేయమని" జార్జి బుష్ చాలా గొప్పగా చెప్పుకున్నాడు. ఇటీవల బాగా చర్చనీయాంశం అయిన మేధో ఆస్తి హక్కు (Intellectual Property right)కి ముప్పు వాటిల్లుతుందని అమెరికా వాదనలోని సారాంశం. ఇక మూడవ ప్రపంచ దేశాలవారికి ఏ మాత్రం బేరమాడే శక్తి వుందో దీన్నిబట్టే అర్థం అవుతోంది.

జీవజాల వైవిధ్య పరిరక్షణ అంటే భూమిమీద నివసిస్తున్న రకరకాల జీవజాలాలను, వాటి స్థావరాలను, వాటి పర్యావరణ విధానాలను కాపాడటమే. అంతే కాక వాటి జన్యు సంపత్తి (genes) ని కాపాడ్డం కూడా బయోడైవర్సిటీ ఒప్పందం క్రిందకి వస్తుంది. ఇది వినడానికి ఎంత సరళంగా వుందో ఆచరణలో అంత కష్టసాధ్యమైనది. గత 400 సంవత్సరాల్లో సుమారు 700 జీవజాలాల రకాలు అంతరించిపోయాయి. ఒక్క అమెరికాలోనే గత దశాబ్ద కాలంలో 54 రకాలు మాయమయ్యాయని అంచనా. ఇంత నష్టానికి కారణం ఏమిటంటే మానవ జాతి పురోగమనం వేల ఎకరాల అడవుల నిర్మూలన, భారీ ప్రాజెక్టుల పేరున భారీ ఎత్తున భూమిని ముంపుకి గురిచేయడం, భూమి వనరులను విచ్చలవిడిగా, అరాజకంగా ఉపయోగించడం అంతా అభివృద్ధి పేరుమీద జరిగిపోతున్న నష్టాలే. ఇవికాక వ్యవసాయ అభివృద్ధి కోసమని కొత్త రకాల 'అధిక దిగుబడి వంగడాల'ను సృష్టించి, అప్పటికి ఎన్నో ఏళ్ళుగా సహజంగా వృద్ధి చెందిన రకాలను

మాయం చేయడం అంతా హరిత విప్లవం అనిపించుకుంది. ఇండోనేషియాలో గత 15 సం॥లుగా వరి హైబ్రిడ్ రకాలను ప్రవేశపెట్టి సుమారు 1500 ప్రాంతీయ రకాలను రూపురేఖలు లేకుండా మాయం చేసారు. మనదేశంలో జీవజాలాల కున్నంత వైవిధ్యం ఎక్కడా లేదు. అలాంటిది ఈనాడు ఎన్నో రకాల వరి, గోధుమ తదితర ధాన్యాల రకాలు పూర్తిగా అంతరించిపోయాయి. కేవలం మన దగ్గర మాయం కావడం మాత్రమే కాదు. ప్రఖ్యాత శాస్త్రవేత్తలనబడే డా॥ స్వామినాథన్ లాంటి మేధావులు ఈ రకాలను కూడా విదేశీ శాస్త్రవేత్తల జన్యు బ్యాంకులకు (gene banks) అమ్ముకున్న సంఘటనలు వున్నాయి. మనదేశానికి మన నేలకి చెందిన ఆ రకాలు ఈ రోజు అమెరికాలో వున్నాయి. మన శాస్త్ర జ్ఞులకు పరిశోధన నిమిత్తం వాటి అవసరం పడితే ఆ విదేశీ సంస్థలకి రాయల్టీ చెల్లించి కొనుక్కోవాలి. కాబట్టి అందిన మేరకు దోచుకొని ఇప్పుడు మేధో ఆస్తి హక్కు గురించి అంతర్జాతీయ వర్తకం సుంకాల ఒప్పందం (GATT) గురించి మాట్లాడుతుంటే మూడవ ప్రపంచ దేశాల ప్రజలు తెల్లమొహాలు వేయడం తప్ప చేసేదేముంది ?

బయోడైవర్సిటీ ఒప్పందం లాగే ఎజెండా-21 అనే డాక్యుమెంట్ మీద కూడా తీవ్ర వాదోపవాదాలు చెలరేగాయి. ఎజెండా-21 భవిష్యత్తు కార్యక్రమాల ప్రణాళికకి సంబంధించినది. దీనిలో భాగంగా రాబోయే శతాబ్దంలో పేదరికం, జనాభా పెరుగుదల, కాలుష్యం వంటి ముఖ్య అంశాలమీద చేపట్టవలసిన కార్య క్రమాలు వున్నాయి. అంటే ఈ కార్యక్రమాల కోసం అవసరమయ్యే నిధిని గురించి ముఖ్యంగా చర్చ జరిగింది. ఇందుకు అమెరికా, జపాన్ ఎంతో 'పెద్ద మనసు'తో తాము ఇప్పటివరకూ ఇస్తున్నదానికి రెట్టింపు మొత్తం ఇస్తామని వాగ్దానం చేసాయి. అలాగే పర్యావరణ పరిరక్షణని దృష్టిలో పెట్టుకొని అనుస రించాల్సిన ఆర్థిక విధానం గురించి వివాదం చెలరేగింది. పారిశ్రామిక వేత్తల ప్రతినిధులు ఇందులో చాలా తెలివిగా పాల్గొని వారి పారిశ్రామిక ప్రయోజనా లకు ఎలాంటి ఆటంకం రాకుండా జాగ్రత్తగా కాపాడుకున్నారు. బహుళజాతి సంస్థల ఊసే రాకుండా ఐక్యరాజ్య సమితి కార్యదర్శి బుత్రోస్ ఘలీ చాలా జాగ్రత్త పడ్డారు. బహుళజాతి సంస్థలు మూడవ ప్రపంచదేశాల ఆర్థిక విధానాన్ని ఏ రకంగా అధోగతిపాలు చేస్తున్నాయో తెలిసిన విషయమే. వాటిపై సరైన కట్టుబాట్లు లేకుండా

భవిష్యత్తు కార్యక్రమాల గురించి మాట్లాడుకోవడం వృథా అని ప్రభుత్వేతర సంస్థలు గట్టిగా ప్రశ్నించాయి. కంటితుడుపుగా ఐక్యరాజ్య సమితి ఒక కమిషన్‌ని ఏర్పాటు చేసింది. పరిసరాలు-నిలకడైన అభివృద్ధి అనే అంశంపైన ఈ కమిషన్ బహుళజాతి సంస్థల కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందని హామీ ఇచ్చింది. అనగా బహుళజాతి సంస్థలను వేలెత్తి చూపవద్దు కావాలంటే పర్యావరణ నిధికి మరికొన్ని కోట్ల డాలర్లు రాసుకోండి పోండి అన్నట్లు వుంది.

సమావేశం సారాంశాన్ని పరిశీలిస్తే మనకు ఒక అనుమానం రాకమానదు. అక్కడ పాల్గొన్న దేశాలకు, ఉత్తరాది, దక్షిణాది భేదం లేకుండా అసలు మొత్తం మీద పర్యావరణం పట్ల సీరియస్‌నెస్ వుందా? సమావేశంలో జరిగిన రెండు మూడు మంచి అంశాలు కూడా ప్రభుత్వేతర సంస్థల చలవ వల్లనేగాని ప్రభుత్వాధినేతల చొరవ వల్ల కాదు. మరెందుకీ సమావేశం? ఇందులో ఎవరి ప్రయోజనాలు వారికున్నాయి. అభివృద్ధి చెందిన ఉత్తరాది దేశాలు సామ్రాజ్యవాద సంక్షోభంలో కొత్త మార్కెట్ల కోసం కొత్త కొత్త సాంకేతిక విధానాలను అమ్ముకుంటున్నారు. ఈ పోటీలో ఈ వేటలో పర్యావరణ విధ్వంసం చాలా అప్రస్తుతం అయిపోతుంది. కాని మూడవ ప్రపంచ దేశాల్లో పెరుగుతున్న పర్యావరణ చైతన్యం, అన్ని చోట్ల చెలరేగుతున్న తీవ్ర అసంతృప్తి దృష్ట్యా ఈ సమావేశం దక్షిణాది దేశాల కంటి తుడుపు కోసం అవసరం అయ్యింది.

దక్షిణాది దేశాల్లో పరిస్థితి మరో రకంగా వుంది. పర్యావరణం పట్ల ప్రభుత్వాల వైఖరి ప్రజల వైఖరికి చాలా భిన్నంగా వుంటుంది. పర్యావరణ ఉద్యమం వ్యవస్థను ప్రశ్నించనంతవరకూ పాలకవర్గాలకి పేచీ వుండదు. అందువల్లనే ఎంత సేపు పర్యావరణ సంక్షోభ భారాన్నంతా అధిక జనాభామీద, పేదరికంమీద మోపేసి ఏవో కొన్ని అస్పష్టమైన సాంకేతిక పరిష్కారాలను చూపుతాయి. కాని ఇవే ప్రభుత్వాలు తాము ప్రాతినిధ్యం వహించే సందర్భాల్లో మాత్రం ఎంతో భిన్నమైన వైఖరిని తీసుకుంటాయి. ఈ సమావేశంలో కూడా సరిగ్గా అదే జరిగింది. దక్షిణాది దేశాలన్నీ ఏకమై ఎంతో అభ్యుదయకరమైన వైఖరిని అవలంబించాయి.

అయితే జరుగుతున్న విధ్వంసాన్ని ఆపే శక్తి వారికి ఎలాగూ లేదు. పైగా వారి వారి దేశాల పర్యావరణ పరిస్థితిని - ప్రభుత్వ విధానాలను పరిశీలిస్తే ఈ సమా

వేళానికి వారు హాజరు కావడం, చర్చల్లో ఎన్నో విప్లవాత్మక సూచనలు చేయడం చాలా హాస్యాస్పదంగా గోచరిస్తుంది. మనదేశంలో అమలవుతున్న పర్యావరణ విధానం అందుకు చక్కటి ఉదాహరణ. ఇటీవల నర్మదా ప్రాజెక్టుని సమీక్షించడానికి ప్రపంచ బ్యాంక్ పంపించిన స్వతంత్ర సమీక్షా బృందం, నర్మదా నిర్వాసితుల విషయంలో భారత ప్రభుత్వం ప్రవర్తించిన అన్యాయమైన రీతిని గురించి తీవ్రంగా విమర్శించింది. నిర్వాసితులకు తగిన న్యాయం చేకూరేవరకు ప్రపంచ బ్యాంకు నిధులను ఆపివేయాలని కూడా తీర్మానించింది. ఈ కమిటి తన రిపోర్టులో భారత ప్రభుత్వం చాలా చక్కటి పర్యావరణ విధానాన్ని రూపొందించుకున్నది- గాని అందుకు తగ్గట్టుగా ప్రవర్తించలేకపోతున్నందుకు విచారిస్తున్నామని ఎద్దేవా చేసింది.

ఇప్పటికైనా నర్మదా నిర్వాసితుల విషయంలోగాని, ఇతర భారీ ప్రాజెక్టుల విషయంలోగాని భారత ప్రభుత్వం తన ప్రవర్తనని మార్చుకుంటుందనుకోవడం కేవలం భ్రమ మాత్రమే. నూతన ఆర్థిక విధానం, ప్రైవేటీకరణ ఫలితంగా ముందు ముందు పర్యావరణ విధ్వంసం రెండింతలైనా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. వీటన్నిటి దృష్ట్యానే ప్రజలను మభ్యపెట్టడానికి, ఎంతో పర్యావరణ చైతన్యంగల దేశంగా పేరు తెచ్చుకోవడానికి మన ప్రభుత్వం ఈ సమావేశం ద్వారా ప్రయత్నించింది. మిగతా మూడవ ప్రపంచ దేశాల పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే వుంది. సమావేశంలో దక్షిణాది దేశాలన్నీ ఏక కంఠంతో ఉత్తరాది దేశాల అధికారాన్ని దురహంకారాన్నీ ప్రశ్నించాయే కాని వారి ఐక్యత ఎంతోసేపు నిలవలేదు. దక్షిణ అమెరికా దేశాలను ఆర్థిక సహాయం పేరుతో ఉత్తరాది దేశాలు అప్పుడే కొనేసాయి.

కనుక సమావేశంలో ఎన్ని ప్రగల్భాలు పలికినా అంతిమంగా ధాత్రి పర్యావరణ క్రమాన్ని నిర్ణయించేది మాత్రం ప్రపంచ బ్యాంక్, ఐ. ఎమ్. ఎఫ్. లేననేది స్పష్టం అవుతోంది.

—కె. అనురాధ

స్త్రీ సమస్య పట్ల మన అవగాహన సమగ్రంగానే ఉందా ?

స్త్రీలను ఆకాశంలోనూ, పోరాటంలోనూ సగంగా గుర్తిస్తున్న మనం, వారి గురించి నిజంగా కార్మికవర్గ దృక్పథంతో ఆలోచించగలుగుతున్నామా ? మన రాజకీయ అవగాహన, సంస్థాపరమైన ఆచరణ మనకిచ్చిన అపారమైన ఆత్మవిశ్వాసం ఈ ప్రశ్నకు అర్థం లేదనిపించేట్టు చేస్తుందేమో కానీ, గడచిన కొద్దికాలంగా మన పత్రికలలో స్త్రీ సమస్యపై చర్చించుకుంటున్నదేమిటి ? ఒక్కసారి మనల్ని మనం సమీక్షించుకుందాం. ఆత్మవిమర్శ చేసుకుందాం.

ఈనాటివరకూ మనం చర్చించుకున్నదంతా అనవసరం అనో, అప్రస్తుతం అనో కాదు గానీ, మన రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా ఉద్యమం, అందులో పాల్గొంటున్న స్త్రీలు, అది స్త్రీల జీవనం పై వేసే ప్రభావం ఏ విధంగా వుంటున్నదీ, మొదలైన అంశాలతో ఒక బలమైన, స్పష్టమైన ఆలోచనా మార్గాన్ని మనం రూపొందించుకోగలిగామా ? మన చుట్టూ అనేక పోరాటాలు జరుగుతున్నాయి. నిర్బంధం పెరుగుతున్నది. నిర్బంధం వివిధ రూపాలలో మన మీద ప్రయోగిస్తున్నారు. ఒక రకంగా వీటి నుంచే ఉద్యమ విస్తృతిని అర్థం చేసుకోవలసిన పరిస్థితిలో మనం వున్నాం. అందుబాటులో వున్న వనరుల నుంచి అయినా మనం వాస్తవాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నామా, లేక మనకు ఇదివరకే ,వున్న సైద్ధాంతిక చట్రంలోంచీ చూడడానికి పరిమితం అవుతున్నామా ?

సామ్రాజ్యవాద సంక్షోభం, దాని ప్రభావంగా సామాజిక జీవనంలో వస్తున్న మార్పులు, కుటుంబ వ్యవస్థలో అస్థిరతా, అభద్రతా భావాలను మనం అర్థం చేసుకోగలం. తారుమారు అవుతున్న ఆర్థిక వ్యవస్థ ప్రభావంగా శ్రామికవర్గాల మహిళలు మరింతగా ఆర్థిక, సామాజిక దోపిడీకి గురవుతున్నారని సిద్ధాంత పరిజ్ఞానం చెబుతూనే వుంది. అయితే, వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామా ? స్త్రీల జీవనంలోకి మొత్తంగా సామాజిక మార్పులు తెస్తున్న నూతన అంశాలను తరచి చూడడం చేస్తున్నామా ? అది మన బాధ్యత కాదా ?

సమాజంలో రకరకాల దృక్పథాలు వున్నవారు నేడు స్త్రీ సమస్య గురించి మాట్లాడుతున్నారు. రచిస్తున్నారు. పని చేస్తున్నారు. మానవతావాదులు, సంస్కరణ వాదులు, అవకాశవాదులూ, ఆఖరుకు ప్రభుత్వంవారు కూడా స్త్రీలను ఉద్ధరిస్తున్నా మంటున్నారు. స్వచ్ఛంద సంస్థల పేరు మీద స్త్రీల, బలహీన వర్గాల "అభివృద్ధి"కి సామ్రాజ్యవాదుల సంపద దేశంలో బలంగా వేళ్ళూనుకుంటున్నది. కులాంతర, మతాంతర వివాహాలు చేయడం మాత్రమే స్త్రీల సమస్యకు పరిష్కారంగా కొందరు భావిస్తున్నారు. వారి కోసం ఉచిత సలహా కేంద్రాలు, పునరావాస కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణా శిబిరాలూ, స్వయం ఉపాధి పథకాలూ కొన్ని సంఘాలు, ప్రభుత్వ శాఖలూ ఏర్పాటు చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలోనూ మహిళల ఉపాధి శిక్షణా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నది.

ఇదివరకు ఎన్నడూలేనిది మహిళా దినోత్సవాలు, పరుగులు (స్త్రీల అభివృద్ధి కోసం!) నిర్వహిస్తున్నారు. ఉచిత న్యాయ సలహా విభాగాన్నొకటి జిల్లా న్యాయస్థానా లలో కేవలం పేరుకు నెలకొల్పుతున్నారు. హైదరాబాద్‌లో పెట్టినట్టుగా ఇతర కొన్ని ప్రాంతాలలో మహిళా పోలీసు స్టేషన్లనూ, మహిళా రక్షక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తూనే వున్నారు. బహుశా మహిళా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు నిలదీసి అడిగితే తప్ప ఇవేవీ కొంచెంగానయినా అమలులోకి రావు. ఇదటుంచి, ఇవేవీ కూడా స్త్రీల మౌలిక సమస్యకు పరిష్కార మార్గాలు కావ న్నది మనకు స్పష్టంగా తెలుసు.

స్త్రీల సమస్యల పట్ల తీవ్ర ఆవేదనతో, వారికి నైతికబలం ఇవ్వాలన్న తప నతో వుండే స్త్రీవాదులు స్త్రీలకు సంబంధించిన వ్యక్తిగత సమస్యలను, వ్యక్తి భావనలనూ ప్రధానంగా చేసుకుంటున్నారు. వ్యక్తిగత సమస్యలు తీర్చుకునేందుకు స్త్రీలకు చేయూతనిచ్చే క్రమంలో వారికి సామాజిక సమస్యల పట్ల సమగ్రమైన ఆలోచనా దృక్పథాన్ని అందించడంలో విఫలం అవుతున్నారు. స్త్రీ సమస్యను మనకు అర్థం చేయించే చట్టాలన్నీ పితృస్వామిక చట్టాలేనంటూ మార్క్సిస్టు దృక్పథంలో సైద్ధాంతిక స్థాయిలో తప్పులెన్నే ప్రయత్నం చేస్తున్నారు. ఈ దృక్పథం విమర్శకు అతీతం కాదు. నిజమే. కాని, రష్యా, చైనా దేశాలలో విప్లవం వచ్చిన అనంతరం కూడా స్త్రీల సమస్యలు పరిష్కారం కాలేదన్న అభిప్రాయానికి వచ్చే ముందు, ఆయా దేశాలలో విప్లవం స్త్రీలకు ఏమిచ్చిందో అధ్యయనం చేయడం అవసరం. సమాజంలో

పునాది నుంచి ఉపరితలం వరకూ ఎన్నో చిన్న, పెద్ద సమస్యలను సమూలంగా పరిష్కరించే క్రమం ప్రపంచంలో ఏ ఒక్క దేశంలోనూ సంపూర్తి కాలేదన్న వాస్తవాన్ని మనం దృష్టిలో ఉంచుకోవాలి. మన సామాజిక, కుటుంబ వ్యవస్థతో ఎంతో సామ్యం వున్న చైనాలో 1949కు ముందుగానే ముప్పయ్యవ దశకంలో ఒకానొక గ్రామంలో ఒక స్త్రీ జీవితానికి ఎయిత్ రూట్ ఆర్మీ ఎటువంటి చైతన్యాన్ని అందించిందో చూద్దాం. చైనాలో విస్తృతంగా పర్యటించిన అమెరికా దేశస్థుడు, విలేకరి జాక్ బెల్డన్ రాసిన "చైనా షేక్స్ ది వరల్డ్"లో గోల్డ్‌ఫ్లవర్ అనే అమ్మాయి కథను వివరిస్తాడు.

చైనాలో ఒక గ్రామంలో భూస్వామ్య వ్యవస్థ అణచివేతలో వున్న ఒకానొక రైతు కుటుంబంలో పుడుతుంది గోల్డ్‌ఫ్లవర్. యుక్తవయసు వచ్చిన తరువాత అదే గ్రామంలో ఒక కుర్రవాడిని ప్రేమిస్తుంది. అతను ఎంత తొందరపడినా ఆమె తన క్రమశిక్షణ వదులుకోదు. వారి మధ్య మంచి స్నేహం పెంపొందుతుంది. కానీ తల్లిదండ్రులు ఆమెకు వేరే గ్రామంలో మరో సంబంధం చూసి, పెళ్ళి చేస్తారు. మొదటిరాత్రే భర్త మొరటుతనాన్ని చవిచూసిన పదిహేను సంవత్సరాల గోల్డుఫ్లవర్ మనసులో తన వివాహం మీద, భర్త మీదా అసహ్యం ఏర్పడుతుంది. అడుగడుగునా తన ఆధిపత్యం చూపించుకుంటూ, అనుమానంతో శారీరకంగా, మానసికంగా హింసించే భర్తను అలరించేందుకు గోల్డ్‌ఫ్లవర్ మూడు సంవత్సరాలపాటు తనను తాను అణిచేసుకుని పైకి మాత్రం మామూలుగా వుంటుంది. భర్త వ్యాపారం కోసం పట్నం వెళ్ళిపోతూ కూడా ఎవరికీ లొంగకని, లొంగితే కొడతాననీ గోల్డుఫ్లవర్ మొహం మీదనే చెప్పి వెళతాడు.

అటువంటి సమయంలో గ్రామాలను విముక్తం చేసుకుంటూ ఎయిత్ రూట్ ఆర్మీ వారి గ్రామం చేరుకుంటుంది. ఎవరికే సమస్యలున్నా వచ్చి చెప్పుకోండని స్త్రీలకు ప్రత్యేకంగా చెబుతుంది. అయితే గోల్డ్‌ఫ్లవర్‌కు ఆర్మీ మీద విశ్వాసం కలగదు. గ్రామంలో కొత్తగా ఏర్పడ్డ మహిళా సంఘంవాళ్ళు గోల్డ్‌ఫ్లవర్ వద్దకు వస్తారు. ఎంతగానో అడిగిన మీదట ఆమె తన కన్నీటి కథ యావత్తూ చెబుతుంది. చివరికి ఒకనాడు మహిళా సంఘం కార్యకర్తలు గోల్డ్‌ఫ్లవర్ మావగారిని నిలదీస్తారు. అతను పొగరుగా మాట్లాడడంతో బహిరంగ వేదిక పైకి ఈడ్చుకువెళతారు, కొడతారు. అందరి ఎదుటా, మావ వింటూండగా గోల్డ్‌ఫ్లవర్ తను పడిన కష్టాలను వివ

రిస్తుంది. అప్పటికీ తప్పు అంగీకరించని, తన మతమే తనదని అనే మావను మహిళా సంఘం కార్యాలయంలో రెండు రోజుల పాటు బంధించి, విడిచి పెడతారు. ఈ మొత్తం సంఘటన గోల్డ్‌ఫ్లవర్‌కు సరికొత్త చైతన్యాన్ని ఇస్తుంది. తనలో సమాజం పట్ల వున్న అసహ్యాన్నీ, కోపాలను ఇక దాచుకోదు. మహిళా సంఘం కార్యకలాపాలలో పాలు పంచుకుంటుంది.

పట్నం నుంచి భర్త తిరిగి వస్తాడు. విషయమంతా తండ్రి చెప్పగా విని కొట్టి పారేస్తాడు. గోల్డ్‌ఫ్లవర్ ఎంతో సంఘర్షణకు లోనై, చివరకు నిర్ణయానికి వస్తుంది. అతన్ని కూడా బహిరంగ వేదిక మీదకు తీసుకువావలసిందిగా మహిళా సంఘాన్ని కోరుతుంది. మావకు ఎదురైన అనుభవాన్నే చవి చూసిన భర్త తనను గోల్డ్‌ఫ్లవర్ కూడా కొట్టడంతో అందరి ముందూ తన తప్పు అంగీకరిస్తాడు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చాక అదంతా తప్పుడు విధానమనీ, ఆడవాళ్ళు బానిసలుగా వుండడమే సహజమనీ అంటాడు. అతనిలో మార్పును ఎలాగూ ఊహించని గోల్డ్‌ఫ్లవర్ తాను కుటుంబంలో పడుతున్న బానిసత్వాన్ని ఎదిరించినప్పుడే స్త్రీ విముక్తికి బాట వేయగలుగు తానని భావిస్తుంది. భర్త నుంచి విడిపోయి పూర్తికాలం ప్రజలకు, పార్టీకి అంకితం అవుతుంది. రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకుంటూ పోతుంది.

మార్క్సిజం, విప్లవం స్త్రీలకు, ఇంకేమివ్వాలి ? ఈ మార్పు అక్కడ నిలిచి పోకూడదు. మునుముందుకు పోవాలి అన్నంతవరకూ మాత్రం సహేతుకమయినదే. అదే విధంగా విప్లవ క్రమంలో పితృస్వామిక భావాలను వదిలించుకుంటూ సాగాలి. అయితే ఇదొక సుదీర్ఘ కార్యక్రమం.

చైనాలోనూ, మన దేశంలోనూ లక్షలాది మంది గోల్డ్‌ఫ్లవర్‌లున్నారు. వారికి "కుటుంబ వ్యవస్థ" చేస్తున్న చెడుపు గురించి విశ్లేషిస్తున్నవారు, దేశంలో ప్రస్తుత పరిస్థితికి మూల్యమైన "ఉత్పత్తి"లో పాల్గొనే స్త్రీలపై జరుగుతున్న దోపిడీని విశ్లేషిస్తున్నారా ? కుటుంబం స్త్రీల సమస్యకు మూలమన్న మాట నిజమే కానీ, కుటుంబ వ్యవస్థపై ప్రభావం వేస్తున్న పెట్టుబడిదారీ దోపిడీ రూపాలు, అవి విస్తృతమవుతున్న తీరుల గురించి మాట్లాడనిదే ఆ ఆలోచన, అవగాహన సమగ్రంగా ఉండవు.

ప్రపంచ బ్యాంకు, ఐ. ఎం. ఎఫ్., ప్రవాస దేశీయుల డబ్బును దేశంలోకి స్వేచ్ఛగా రానిస్తున్న ప్రభుత్వ విధానాల వల్ల ఎన్నో పరిశ్రమలు మూలనపడ్డాయి.

దేశంలో నిరుద్యోగం పెరుగుతూనే వుంది. ఈ దశలో, మహిళా కార్మికులు దాదాపు తొంభై శాతం పైగా అసంఘటిత రంగంలో వున్నారు. వీరిలో అధికులు వ్యవసాయ కూలీలే. అయితే భారీ పరిశ్రమలలో ఎక్కడా కూడా మహిళా కార్మికులు లేరు. బీడీలు, గోళీలు, సీసాలు, స్వీట్లు తదితర చిన్నపాటి పరిశ్రమలలో ఏ ఒక్క కార్మిక చట్ట నిబంధనలూ లేకుండా మహిళా కార్మికులు పని చేస్తున్నారు. సాంకేతిక రంగంలో మహిళల సంఖ్య అత్యంత స్వల్పంగా వుంది. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించినా, అసలు రాజ్యాంగంలోనే సమానత్వ హక్కు కల్పించినా మహిళా కార్మికుల సంఖ్య దేశవ్యాప్తంగా తక్కువగానే వుందని గణాంకాలు చెబుతున్నాయి. దేశ ఆర్థిక రంగంలో జరుగుతున్న మార్పులు ఉత్పత్తి క్రమంలో స్త్రీల పాత్రను ఏ విధంగా మార్చివేయనున్నాయో మనం అధ్యయనం చేయవలసి వుంది. సామాజిక జీవనానికి పునాదిగా వున్న ఉత్పత్తి రంగాన్ని మనం నిత్యం గమనిస్తూండాలి.

మన అవగాహనలో వున్న ఈ సంగతులన్నీ ఆలోచనా దృక్పథంలో చోటు చేసుకుంటున్నాయా అన్నది ఒక ప్రశ్న. వాస్తవ పరిస్థితుల నుంచి పరిజ్ఞానం ఏర్పరచుకోవాలన్న దృక్పథం ఆచరణలో మనం అలవరచుకుంటున్నామా లేదా అన్నది మరొక ప్రశ్న.

ప్రజా ఉద్యమాల మౌలిక పాత్రను అంగీకరించేవారు కూడా పై పై అంశాల గురించి మాట్లాడుతున్నారే తప్ప సమస్య గురించి మౌలిక, వాస్తవ పరిశోధనను విస్మరిస్తున్నారు. మతం, మతోన్మాదం, కుటుంబం, మాతృత్వం, పర్యావరణం, ఇవీ ఇటువంటి విషయాలలో స్త్రీ సమస్యను చర్చిస్తూ వివిధ బయటి పత్రికలు వ్యాసాలు ప్రచురిస్తున్నాయి. వీటిని మించిన చర్చ మన పత్రికలలో ఇటీవలి కాలంలో ఏమన్నా సాగుతున్నదా ? ఉద్యమ కార్యకర్తల నుంచి అడపా దడపా వస్తున్న నివేదికల వంటి వ్యాసాలు, కవితలు, కథలు మినహా ఆలోచనాత్మక వ్యాసాలు మరేవీ రావడం లేదు. నిజానికి 'రాగో', 'వసంతగీతం' వంటి రచనలు, ఇతర ఉద్యమ సాహిత్యం మనకు గొప్ప వనరు. వాటిని లోతుగా అర్థం చేసుకుని, మన ఆలోచనలకు పదును పెట్టుకోవచ్చు. ఈ విధంగా, మనమంతా అంగీకరిస్తున్న విప్లవ క్రమం లేవనెత్తుతున్న అంశాలపై చర్చ జరుగుతున్నదా ?

వ్యక్తిగతంగా మనం మహిళా సంఘాలలో పని చేస్తూండవచ్చు. వారికి చేయూతను ఇస్తూండవచ్చు. వ్యాసాలు రాస్తూండవచ్చు. కానీ, సంఘటితంగా మన

ప్రాపంచిక దృక్పథంలో స్త్రీ సమస్యకు ఎటువంటి స్థానం ఇస్తున్నాం ? మనకున్న రాజకీయ దృక్పథాన్ని సమగ్రంగా స్త్రీ సమస్యకు అన్వయించిచూస్తున్నామా ?

మహిళలను ప్రజా ఉద్యమంలో భాగస్థులను చేయడంలో గతంలో పోరాటాలు నడిపిన నాయకత్వం పూర్తిగా సఫలం కాలేకపోయిందని మనం భావిస్తున్నాం. ఆనాటి తెలంగాణ, శ్రీకాకుళ పోరాటాలు గడచి కొన్ని దశాబ్దాలు దాటిపోయాయి. ఈనాటి పరిస్థితి వేరు. ఇప్పుడు ఉద్యమంలో స్త్రీల భాగస్వామ్యం పెరిగింది. అంతేకాదు. సమాజంలో మధ్య, శ్రామిక తరగతులకు చెందిన స్త్రీ చైతన్యం రూపొందే క్రమం తీవ్రతరం అయ్యింది. పెరుగుతున్న అత్యాచారాలు, అణచివేత వారి ఆలోచనలను పట్టి కుదుపుతున్నాయి.

గిరిజన తెగకు చెందిన 'రాగో' వంటివారు తమ వద్దకు వస్తున్న దళం కార్యకలాపాలతో ఏ విధంగా చైతన్యవంతం అవుతున్నారో మనం వివిధ కథలలో చూస్తున్నాం. మైదాన ప్రాంత గ్రామానికి చెందిన ఒక యువతి గురించి ఒకసారి తెలుసుకుందాం. తన తండ్రినీ, అతని భాగుడునూ, తననూ, తన ఇద్దరు తమ్ముళ్ళను కూలి చేసి పోషించేది. తల్లి తండ్రితో గొడవపడి పుట్టింటికి వెళ్ళి పోయింది. పెళ్ళి వయసు వచ్చిన దగ్గర్నుంచి తండ్రి, బంధువుల నస ఎక్కువయ్యింది. ఎవర్నో కట్టబెడదామన్న వాళ్ళ ప్రయత్నాలకు ఎప్పటికప్పుడు అడ్డం పడుతూ వచ్చింది. ఆ సమయంలో సంఘంతో పరిచయాలు ఏర్పడ్డాయి. సంఘం ఇచ్చిన చైతన్యంతో ఆమె సంఘర్షణకు స్పష్టత ఏర్పడింది. తన సమస్య, సమాజం మొత్తం సమస్యతో ముడిపడి వుందన్న విషయం గ్రహించి సంఘంలోకి వచ్చింది. దళంలో చేరింది.

పట్నంలో కృత్రిమమైన సమాజంలో బతికే మరొక యువతి కథ ఇది. పెళ్ళి చేసుకున్న కొన్నాళ్ళకు భర్త విడాకులిచ్చేస్తాడు. దాని వల్ల తన జీవితం మొత్తం నాశనం అయ్యిందని భావించలేదు ఆమె. ఒకానొక పట్నంలో బతుకు తూండిన ఈమె తనకు తగిలిన గాయంతో కుమిలిపోకుండా దాని లోతుపాతులను అవగాహన చేసుకుంది. తన లాంటి వారి కోసం పని చేయాలనుకుంది. పార్టీలో పూర్తి కాలం కార్యకర్తగా ఎదిగింది. రాగో గానీ, వీరుగాని సమాజం నుంచి వచ్చిన ఫ్యూడల్ భావాలను వదిలించుకునేందుకు సంఘర్షణ పడుతూండవచ్చు. ఆ క్రమం వారిని ఎలా పటిష్ఠం చేస్తున్నదీ, అది ఉద్యమానికి ఎలా దోహదపడుతున్నదీ మనం

అర్థం చేసుకోవచ్చు. అలాగే 'మహిళా మార్గం' లో ఫీల్డ్ రిపోర్టుల పేరిట లోతైన వ్యాసాలు వచ్చాయి.

మనం ఇటువంటి వాస్తవ నివేదికలు సేకరించేందుకు కృషి చేస్తున్నామా ? సాధ్యమయినంతవరకూ మహిళా ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా, ఆచరణ నుంచి ఆలోచనను రూపొందించుకునే క్రమం ఒకటి సాగుతున్నదా ? వివిధ వర్గాల స్త్రీల జీవన స్థితిగతులను అధ్యయనం చేసి, మన సైద్ధాంతిక పరిజ్ఞానంతో విశ్లేషించుకుని, తద్వారా రూపొందించుకున్న సరికొత్త చైతన్యాన్ని, దృక్పథాన్ని తిరిగి వారికి అందించే బాధ్యతను మనం స్వీకరిస్తున్నామా ?

ఉత్పత్తిలో ప్రత్యక్షంగా పాలు పంచుకునే స్త్రీలకు "పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్ళు తప్ప" అన్నదీ ఎంతగా వర్తిస్తుందో, ప్రస్తుత సంక్షోభ సమయంలో అస్తిత్వ వేదనకు గురవుతున్న మధ్యతరగతి మహిళకు కూడా అంతే స్థాయిలో ఆ మాట వర్తిస్తుంది. ఇది వాళ్ళకు అర్థం చేయించటం మన బాధ్యత కాదా ? మనం ప్రజలకు చేరువ కావడం మన పరిమితులకు సంబంధించిన ప్రశ్న. ఎటువంటి పరిమితులూ అవసరం లేకుండానే మనం చేయగలిగిన పని ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. మనం చేస్తున్న పనులు ఆచరణకు ఒక పార్శ్వం మాత్రమే. అన్నింటికంటే ముఖ్యమైనదీ, మౌలికమయినదీ, స్త్రీలకు మనం అందిస్తున్న ఆలోచనా మార్గం ఏమిటి అన్నదే. ఇక్కడే మనం లోతుగా ఆత్మ విమర్శ చేసుకోవలసి వుంది. ఎంతో నేర్చుకోవలసి వుంది. చర్చించవలసింది వుంది.

— సహచరిణులు

హక్కు నాది

కొండనాది
గుట్టనాది
అడవినాది
అడవిలో ఆస్తినాది
ఆస్తిమీద హక్కునాది
హక్కును హరించేవాడి గుండెను చీల్చే పదునైన గాలంనాది
తలను కూల్చే తుపాకి నాది

ఎరువునాది-వాగు నాది
చెరువునాది-సముద్రంనాది
సముద్రంలో ఆస్తినాది
ఆస్తిమీద హక్కునాది
హక్కును హరించేవాడి

పైరునాది-పంటనాది
భూమినాది-
భూమిమీద ఆస్తినాది
ఆస్తిమీద హక్కునాది
హక్కును హరించేవాడి
కుత్తుక తెగ్గోసే కొడవలి నాది

—ఇంద్రవెల్లి

కథనం

కొండవాగు

1

రెండు జతల బట్టల్తో, జిప్పు బ్యాగు భుజానికి తగిలించుకొని ఇంటినుండి బయల్దేరాను. అడవిలో అవసరం కాగల కొద్దిపాటి వస్తువుల్ని ముందే కొనుక్కున్నాను. అలా మార్చి నెల 13వ తారీఖున ఆంధ్రదేశం కోస్తాజిల్లాల నుండి బయల్దేరిన నేను, అంచలంచలుగా 16 వందల కిలోమీటర్ల దూరం ప్రయాణంచేసి, నాలుగవ రోజుకు దండకారణ్యాన్ని ఆనుకునివున్న ఓ ప్రసిద్ధమైన పట్నాన్ని చేరాను.

అక్కడే కామ్రేడ్ తారాచంద్, కామ్రేడ్ సహర్ష కలిశారు. సహర్ష తానూ అధ్యయన తరగతులకు హాజరవడానికి వచ్చాడు. మా ఇద్దర్నీ అడవిలోకి తీసుకు వెళ్ళవల్సిన బాధ్యత తారాచంద్‌ది!

ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ముగ్గురం రైలు ఎక్కాం: పూర్తిగా అడవిని అనుకునివున్న ఓ చిన్నస్టేషన్‌ను చేరడానికి! అక్కణ్ణుండి అడవిలోని ఓ ఆదివాసి పల్లెను చేరాలి!

మే మా స్టేషన్‌లో దిగేసరికి రాత్రి తొమ్మిది దాటింది. మమ్మల్ని పల్లెకు తీసుకువెళ్ళడానికి వచ్చిన ఆదివాసీ యువకులు స్టేషన్ దగ్గర కలిశారు. వాళ్ళు తారాచంద్‌కు పరిచయులే!

వాళ్ళల్లో పెద్దగా వున్న మధ్యవయుస్కుడు, తారాచంద్‌తో మాట్లాడాడు. అందరూ కరచాలనం చేసి లాల్‌సలాం చెప్పారు మాకు!

అంతా చీకటి! దట్టమైన అడవి!

ఆదివాసీ యువకులు ముందు నడుస్తూన్నారు. మేమువాళ్ళని అనుసరిస్తూన్నాం. కామ్రేడ్ తారాచంద్‌కు అడవి నడక అలవాటే! కామ్రేడ్ సహర్షకు ఫరవాలేదు! కానీ, చీకట్లో, అందులో అడవిలో నడవడం నా వూహకు అందని విషయం....

మధ్య మధ్యా టార్చి వేసుకుంటూ నడుస్తూన్నాను. మాటిమాటికీ వెనకబడి పోతూన్నాను. ఎక్కువసేపు టార్చిని వేయడానికి వెరుగ్గావుంది 'గెరిల్లాలకు రాత్రి పూట్ల లైటు శత్రువు' అన్న సూక్తి జ్ఞప్తికి వస్తోంది.

వాళ్ళు దారిపొడుగునా గోండీ కల్సిన హిందీలో మాట్లాడుకుంటూన్నారు.

ఆదివాసీల్లో పెద్దవాడు, మేము వెళ్ళవల్సిన గ్రామ మునీమ్ అని తరువాత తెల్సింది !

రాత్రి పదకొండు గంటలకు మే మా గ్రామం చేరాం. మునీమ్ ఇంటికే వెళ్ళాం.

కాళ్ళూ చేతులూ కడుక్కొని, ఇంట్లోకి వెళ్ళి, మా సంచుల్ని గుంజలకు తగిలించి మంచం మీద కూచున్నాం: నేనూ సహర్ష ! తారాచంద్, ఇంటి యజమాని మునీమ్‌తోపాటు లోపలకు వెళ్ళి మాట్లాడుతూన్నాడు: బహుశ, ఆ రాత్రి మేము అక్కడ వుండటాన్ని గురించి, గ్రామ పరిస్థితిని గురించి మాట్లాడుతూన్నా డనుకున్నాను !

మేము గ్రామంలోకి వెళ్ళిన దగ్గర్నుంచి కల్సిన ప్రతి ఒక్క ఆదివాసి కర చాలనం చేసి లాల్‌సలామ్ చెప్పటం ఓ ప్రత్యేకత అనిపించింది.

అక్కడ ఆదివాసీల్లో పార్టీ ఎంతగా చొచ్చుకుపోయిందంటే-ప్రతి ఒక్కరూ అన్నలకు లాల్‌సలామ్ చెప్పి, కరచాలనం చేసి-పార్టీ పట్ల తమకు గల అచంచల విశ్వాసాన్ని చాటుతారు !

అక్కడవున్న వాళ్ళు దాదాలం (పార్టీ కార్యకర్తలు) వచ్చామని, ఎంతో ఆప్యాయతను కనబరచారు.

వసారాలో నెగడు మండుతోంది. దాదాలు ఈ ప్రాంతానికి వచ్చాక వనవిభాగ్ వాళ్ళ అత్యాచారాలు అంతం అయ్యాయనీ, ఆదివాసీలు తమ కుటుంబానికి అవుసర మైన కట్టెను స్వేచ్ఛగా తెచ్చుకోగలుగుతున్నారని తెల్సింది.

తారాచంద్ వసారాలోకి వచ్చాడు. మండుతూన్న దుంగల్ని చూపుతూ "ఆ మొద్దులు ఎప్పుడూ అలాగే మండుతూంటాయా ?" అని అడిగాను.

"అవి రాత్రింబగళ్ళు అలా మండుతూనే వుంటాయి ! వీళ్ళకు కప్పుకోను దుప్పట్లూ అవీ వుండవు. రాత్రిపూట కుటుంబ సభ్యులు ఆ మంట చుట్టూ పడు కుంటారు !" అని చెప్పాడు తారాచంద్.

ఇంతలో 'కాలీచాయ్' తెచ్చి ఇచ్చారు తలా కొంచం. పాలు కలవని ఒట్టి టీ డికాక్షన్‌ను 'కాలీచాయ్' అంటారు. ఆదివాసీలు ఆవుల్ని పెంచుతారు. ఐతే, పాలు తీయరు. మజ్జిగ, పాలు, పెరుగు- వాడకం వాళ్ళకు తెలియదు.

దాదాలు ఆ ప్రాంతానికి వచ్చాక, ఆర్. డి. ఓ: తాసీల్దార్ ఆ వూరికి చేసిన

సౌకర్యాన్ని గురించి, పోలీసు ఇనస్పెక్టర్ తనను బెదిరించడాన్ని గురించి మునీమ్ ఒకటే చెప్పుకుపోతూన్నాడు.

తాసీల్దార్ వూళ్ళో బోరింగ్ వేయించడానికి హామీ ఇచ్చాడుట....స్కూలు పెట్టిస్తానన్నాడుట....డాక్టరు నియమంగా వూళ్ళోకి వచ్చే ఏర్పాటు చేస్తానన్నాడుట!

"ఇస్కే పహలే, సాలా డాక్టర్ గాం మే నహీ ఆతా థా! అబ్ ఐసానహీ! రాత్‌మే ఖబర్ భేజోతో, సుబహ్ దౌడా దౌడా ఆతా, సాలా!" (ఇంతకు ముందు డాక్టరు వూళ్ళోకి వచ్చేవాడు కాదు. ఇప్పుడలా కాదు, రాత్రి కబురుచేస్తే తెల్లవారే సరికి పరుగెత్తుకు వస్తాడు, నాయాలు!) అని తారాచంద్‌తో ఇంటి యజమాని మునీమ్ చెప్తూన్నాడు.

తారాచంద్ ఆ ప్రాంతంలోని గెరిల్లా దళ సభ్యుడని తరువాత తెల్సింది!

మునీమ్ ఇంకా చెప్తూనే వున్నాడు- "ఓ సాలా, దారోగా కహతాహైకి తుమ్హారే ఘర్ నక్సల్‌వాది ఆతెహైం! తుమ్‌కో అందర్ కర్‌దూంగా! ఫిర్, మైనే ఉస్‌సే కహా; మేరే ఘర్ నక్సల్‌వాది కాహేకో ఆతే హైం? అబ్‌తకీ మై ఉన్కా శక్లతక్ దేఖానహీం! తుమ్ కిస్ జుల్మ్‌కేలియె మెరేకో అందర్ కరోగే? కరోగేతో ....కరో....సచ్ బాత్‌తో యహ్‌హైకి-అబ్‌తక్ మై ఉన్కా శక్లతక్ నహీ దేఖాహై మేరా ఐసా బోల్‌నేకేబాద్, సాలాదారోగా ఛుప్ హోగయా!" (ఆ నాయాల ఇన్‌స్పెక్టరు- నీ యింటికి నక్సలైట్లు వస్తూన్నారు. నిన్ను కొట్లో పెడతాను-అంటున్నాడు. నేనిలా అన్నాను-నా యింటికి నక్సలైట్లు ఎందుకు వస్తారు? నిజానికి నేనింతవరకూ వాళ్ళ ముఖమే చూడలేదు! నేనేం తప్పు చేశానని నన్ను నువ్వు కొట్లో పెడతావ్? పెడితే పెట్టు....నేను మాత్రం వాళ్ళ ముఖం ఇంతవరకు చూడలేదు!- ఇంక నాయాల నోరు మూశాడు.)

బయట దట్టమైన అడవి. చీకటి, చలిగాలి రివ్వున కొడుతోంది. దాదాలం వచ్చామని తెల్సి వూళ్ళోవాళ్ళు వచ్చి కరచాలనం చేసి, లాల్‌సలాం చెప్పి వెడుతూన్నారు.

ఇంతసేపట్లో ఇంటి ఇల్లాలు మాకోసం భోజనం తయారుచేసింది. పంది మాంసం, జొన్న-గోధుమ కల్సిన రొట్టెలకు తోడు ఆప్యాయతతో భోజనం పెట్టింది ఇల్లాలు.

భోజనం అయ్యాక నేనూ సహర్ష ఒక మంచంమీద పడుకున్నాం. అడవి నడక, జొన్నరొట్టెలు-ఒళ్ళు తెలియని నిద్ర పట్టింది !

2

తెల తెలవారుతుండగా మెళకువ వచ్చింది. వాచి చూసుకున్నాను. ఐదున్నర అయింది.

ముగ్గురం మా మా బ్యాగుల్ని చంకలకు తగిలించుకుని బయల్దేరాము. బయల్దేరేముందు అందరితో కరచాలనం చేసి లాల్‌సలామ్ చెప్పాం. ఆ ఇంటి యువకుడే మాకు మార్గదర్శకుడిగా ముందు నడుస్తున్నాడు.

గెరిల్లా దళాలు విడిది చేసిన ప్రదేశానికి ప్రస్థానం సాగించాం.

అడవిలో కాంతిరేఖలు విచ్చుకుంటున్నాయి. మొదటిసారిగా అడవిలో ప్రభాతాన్ని చూడడం గొప్ప అనుభూతిని కలిగించింది నాలో !

తెల్లమద్ది, అరింద, రిప్పి, టేకు-మొదలైన చెట్లూ, వెదురు పొదలూ, ఎన్నడూ వినని కొత్త కొత్త రకాల పిట్టల విచిత్రమైన కూతలూ-ఓ అద్భుత ప్రపంచంలోకి వచ్చాననిపించింది !

తీగల్నీ, కొమ్మల్నీ నెట్టుకుంటూ; రాళ్ళనూ, గుట్టల్నూ దాటుకుంటూ ముందుకు నడుస్తూన్నాం. ఎన్నడూ చూడని రకరకాల చెట్లు, విచిత్రమైన పక్షుల కూతలు, ఎండుటాకుల గలగలలు-అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు నడుస్తూన్నాం.

ముందు మార్గదర్శకుడైన ఆదివాసీ యువకుడు నడుస్తూన్నాడు. అతడిని అనుసరించి కామ్రేడ్ తారాచంద్, తరువాత సహర్ష, అందరికంటె చివర నేనూ-నడుస్తూన్నాం.

ఓ గంటసేపు అలా నడిచాక ఒక ఆదివాసీ గ్రామాన్ని సమీపించాం.

అప్పటికి బాగా తెల్లవారింది. స్వచ్ఛమైన సూర్యకాంతి పచ్చని ఆకులమీదా, కొండరాళ్ళమీదా, విశాలంగా పరచుకున్న పసిరికమీదా మిల మిల్లాడుతోంది.

ఒక స్త్రీ చంకలో బుట్టతో ఊళ్ళోంచి వస్తూ కనుపించింది. ఇప్పపూలు ఏరుకోడానికి వెడుతూన్నది. నల్లని నలుపు, కొంచం పొట్టి, సన్నని ఒంకులు తిరిగిన జుట్టు, మట్టి కొట్టుకుని, శరీరానికి సరిపడని, దరిద్రాన్ని తెల్పుతూన్న కొద్దిపాటి వస్త్రధారణ !

ఆమె మా దగ్గరకు వచ్చాక—"నాట్ సచ్చే దేస్ మంతా బాయీ ?" అని అడిగాడు తారాచంద్. అంటే 'వూర్లో అంతా బాగున్నారా ?' అని అర్థం.

"సచ్చేమంతా, దాదా !" (అందరూ బాగున్నారు !) అన్నదామె.

"వాళ్ళనలా పలకరించకపోతే, కొత్త వాళ్ళమనే వుద్దేశంతో బెరుకుపడ తారు !" తారాచంద్ అన్నాడు.

మరి నాలుగు అడుగులువేసి ఊరిని సమీపించాం. అప్పటి వరకూ మార్గదర్శకుడిగా వచ్చిన యువకుడు కరచాలనం చేసి, లాల్‌సలామ్ చెప్పి వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

ఊళ్ళో నుండి మరో ఆదివాసీ యువకుడు మార్గదర్శకుడిగా వచ్చాడు. ఎర్రగా దృఢంగావున్న ఆ యువకుడు ముందు నడుస్తుండగా గెరిల్లా దళం క్యాంప్ వేసిన అడవికి బయలుదేరాం ! మోకాళ్ళు కొద్దిగా దాటిన పచ్చని వస్త్రం అడ్డకట్టు కట్టుకున్నాడతడు. అలాంటిదే మరో వస్త్రం పైన వేసుకున్నాడు.

అక్కణ్ణుండి కష్టతరమైన మార్గాన నడవాల్సి వచ్చింది. జాగ్రత్తల్ని పకడ్బందీగా పాటించవల్సిన అవసరమూ కలిగింది.

కొద్దిసేపట్లోనే మేము దట్టమైన అడవిలోకి చేరాము. విశాలమైన వెదురు, తేందూ పత్తా చెట్లతో నిండిన అడవుల్ని దాటుతూన్నాము.

ముందుకు వెడుతూన్న కొద్దీ ఎత్తుకు ఎక్కుతూన్నాము. అక్కడ నడవడం అంటే ఎత్తుకు ఎక్కడమేననిపించింది. ముందుకు పోవడం అంటే బండరాళ్ళను ఎక్కడమనే అర్థంగా వుంది. రాళ్ళనూ, బండలనూ ఎక్కుతూ దిగుతూ, అల్లిబిల్లిగా వ్యాపించిన చెట్లనూ, తీగెలనూ దాటుతూ ముందుకు పోవడం—కాదు, పైకి ఎక్కడం—చాలా కష్టం అనిపించింది. అడవిలో, వివిధ రకాలయిన చెట్ల తాలూకు వాసనలనూ కలుపుకుని ఓ కొత్తరకపు వాసనతో మిళితమైన ప్రాణవాయువు పుష్కలంగా లభిస్తుంది—ఐనప్పటికీ మరికొద్ది దూరం నడిచేసరికి ఎగశ్వాస ప్రారంభమయింది. పిక్కలు పట్టేశాయి. ఇక ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేని స్థితికి వచ్చాను. సహార్ నా చేయి పట్టుకు నడిపిస్తూన్నాడు. ఆదివాసీ యువకుడూ, తారాచంద్ చకచకా పాకిపోతూన్నారు. ముందుకు అడుగువేస్తూన్న కొద్దీ కొత్త కొత్త చెట్లు కనిపిస్తూన్నాయి. కాళ్ళకింద పడి నలిగే ఎండుటాకుల శబ్దాలు వినిపిస్తూన్నాయి.

"మట్టిలో అడుగులు వేయకండి, అడుగుల గుర్తులు పడనీయకండి !" తారాచంద్ ఆగి హెచ్చరించాడు.

మేమలా అడవిలో, కొండల్ని ఎక్కుతూ ఆదివాసీ యువకుడి మార్గదర్శకత్వంలో ముందుకు సాగిపోతూంటే, ఆఫ్రికా అడవుల్లో తీసిన ఆంగ్ల చిత్రాల్లోని దృశ్యాల్ని తలదన్నే అద్భుత దృశ్యం మనస్సులో బొమ్మకట్ట సాగింది.

మరో అరగంట నడచి, ఒకానొక పర్వతపు అగ్రభాగానికి చేరి, రెండవ వైపుకు కిందికి దిగాం !

అక్కడే సహజనీటి వనరు కలిగిన కొన్ని వందల గజాల ఏటవాలు ప్రదేశంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న మూడు పందిళ్ళు కనుపించాయి ! ఎదురు వాసాల్ని పోటీగాపెట్టి, రెల్లుగడ్డి కప్పి పందిళ్ళు ఏర్పాటుచేసుకున్నారు. ఒక పందిట్లో వంట తాలూకు పొగలూ-శగలూ కనుపించాయి. మరో పందిట్లో బ్యాగులూ, ఇతర సామాన్లూ పెట్టివున్నాయి. మూడవ పందిట్లో దాదాపు 30 మంది వరకూ గెరిల్లాలున్నారు. అందరి బుజాల్నా తుపాకులు వున్నాయి. కొందరి దగ్గర ఎ.కె. 47 లు వున్నాయి.

వాళ్ళల్లో 7 గురు మహిళా గెరిల్లా కామ్రేడ్స్ వున్నారు. ఆలివ్‌గ్రీన్ డ్రస్సులో బుజాలకు తుపాకులు తగిలించుకుని, కిలకిలా నవ్వుతూ అటూ-ఇటూ తిరుగుతూన్న ఆ మహిళా గెరిల్లా కామ్రేడ్స్‌ని చూసిన క్షణాన ప్రసిద్ధ రష్యన్ నవల 'ప్రశాంత ప్రత్యూషాలు' బుర్రలో తళుక్కున మెరిసింది. మహిళా గెరిల్లాలు నన్నూ సహర్షనూ చూసి మరీ కిలకిలా నవ్వసాగారు.

3

రెండు దళాలకు చెందిన గెరిల్లాలు వాళ్ళు ! వాళ్ళకు నేను పెద్దన్నగా పరిచయం అయ్యాను. సహర్ష ఆ పేరుతోనే పరిచయం అయ్యాడు. మా మార్గ దర్శకుడైన ఆదివాసీ యువకుడు వెనక్కి వెళ్ళిపోయాడు.

అక్కడున్న గెరిల్లా కామ్రేడ్స్ నందరినీ ఓ మాటు పరిశీలనగా చూశాను. 17 నుండి 30 ఏళ్ళలోపు వయస్సు కలవాళ్ళే అందరూ ! అందునా, 20-22 ఏళ్ళ వయస్సు కలవాళ్ళే ఎక్కువ సంఖ్యలో వున్నారు. మహిళా గెరిల్లాలు మరీ చిన్న వాళ్ళు !

ప్రతి ఒక్కరి బుజాన వాళ్ళకు కేటాయించిన ఆయుధం వుంది.

శక్తులు నిండిన రక్తం వుండే యువతీ యువకులు, ఈ దేశ పాలకవర్గాల దోపిడీనీ, అకృత్యాలనూ చూసి, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వెలుగులో, ఈ దేశంలోని దళారి బూర్జువా భూస్వామ్య వ్యవస్థను సాయుధంగా కూలదోసి, సామ్యవాద సమసమాజాన్ని నిర్మించే క్రమంలో తాము సాయుధులై, ప్రజల్ని సాయుధుల్ని చేస్తూ ఇక్కడిలా విప్లవాచరణకు శ్రీకారం చుడుతూన్నారని పించింది.

ఆ గెరిల్లా కామ్రేడ్స్ ముఖాల్లో, కండ్లల్లో-వారి మీద తమ ఆశల్ని నిలుపుకున్న కష్టజీవుల, దరిద్రుల, బాధాసర్పదష్టుల, దగాపడిన తమ్ముల-కష్టం వాలక కడుపు మంటచే దహించుకుపోయే కోట్లాది మానవుల ఆశలూ-ఆశయాలూ అంతర్లీనంగా దృగ్గోచరమై పులకించాను!

ఆ రోజుల్లా గెరిల్లా జీవితం ఎలా వుంటుందో పరిశీలించాను. గెరిల్లా ఎలాంటి పరిస్థితిలోనూ తన ఆయుధాన్ని, కిట్టునీ విడిచిపెట్టడు. మహిళా గెరిల్లా కామ్రేడ్స్ మగకామ్రేడ్స్‌కు ఏమాత్రం తీసిపోకుండా తమ బాధ్యతల్ని నిర్వహిస్తారు. అర్ధరాత్రి అయినా, అపరాత్రి అయినా సెంట్రీ చేయకతప్పదు. మహిళా గెరిల్లా కామ్రేడ్స్ చేస్తారు!

ఆశ్చర్యకరమైన విషయం: ప్రతి గెరిల్లా కిట్టులోనూ మార్క్సిస్టు సాహిత్యానికి సంబంధించిన ఏదో ఒక పుస్తకం వుంటుంది. క్రాంతి, రాడికల్ మార్చ్, ప్రభాత్ (హింది). అరుణతార, సృజన- ఇతర ప్రగతిశీలకమైన నవలలూ, సాహిత్యం—వీటిని ఒకరిద్దరు మినహా అందరూ చదువుతారు! అలాగే, ఒకరిద్దరు మినహా అందరూ హిందీ మాట్లాడగలరు. కొందరికి హిందీ చదవడమూ, రాయడము కూడా వచ్చును. డిగ్రీ అయినవాళ్ళూ, డిగ్రీ చదువును మధ్యలోనే వదిలి వచ్చినవాళ్ళూ కొందరున్నారు! చదువురాని ఆదివాసీ గెరిల్లాలు ఇప్పుడు -దళాల్లోకి వచ్చాక-చదువు కుంటున్నారు.

మరో విచిత్రమైన విషయం ఎక్కువమంది గెరిల్లాలు కవులో, రచయితలో ఐవుంటారు. ఇది రాస్తూన్న క్షణాన-సాధారణ విద్యాభ్యాసం గల మహారాష్ట్రి జాతీయుడైన ఒక గెరిల్లా మరాఠీ భాషలో తాను రాసిన విప్లవగేయం నాకు వినిపిస్తూన్నాడు.

ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా మకాం వేసినప్పుడు గెరిల్లాలు ఉదయం ఒకమాటు ఏదో ఒకటి తిని చాయ్ తాగుతారు. మళ్ళీ పది గంటలకు కాలీచాయ్ తాగుతారు. పన్నెండు తరువాత భోజనం! తిరిగి మధ్యాహ్నం

కాలీవాయ్, రాత్రికి భోజనం ! రుచికి అంతగా ప్రాధాన్యతనివ్వరు. ఏ పదార్థం దొరికితే దాన్ని తింటారు. ఇది క్యాంపులో వున్నప్పటి స్థితి. ఏరియాలో తిరిగేప్పుడు ప్రజలు ఏ భోజనం పెడితే దాన్నే తింటారు.

గెరిల్లా విద్యపట్లా, విజ్ఞానం పట్లా అపారమైన జిజ్ఞాసను కలిగి వుంటాడనడం అతిశయోక్తికాదు. ఒక్కో శబ్దం గురించి, గ్రంథాల గురించి, భాషల్ని గురించి- తర్కించుకోవడం, విమర్శించుకోవడం చూశానక్కడ !

గెరిల్లా కామ్రేడ్స్‌లో- చనువుగా మాట్లాడుకుంటూ, పరిహాసాలు ఆడుకునే సందర్భాలూ తరచుగా వస్తుంటాయి. అలాంటప్పుడు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వుకోవడం జరుగుతుంది !

అక్కడి గెరిల్లా కామ్రేడ్స్ దిన చర్యను పరిశీలిస్తుంటే ఇలా అనిపించింది- ఏ క్షణానైనా మృత్యువుకు సిద్ధమే ! ఏ క్షణానైనా తలమునకలవుతూ పనిలో నిమగ్నమే ? ఏ క్షణానైనా శత్రువుతో తలపడడానికి సన్నద్ధమే.

4

ఆ మర్నాడే గెరిల్లా క్యాంప్‌ను మరో చోటికి మార్చారు.

ఆ రోజు వుదయాన్నే ఎవరి బ్యాగులు వాళ్ళు సరిచూసుకున్నారు. గెరిల్లా కామ్రేడ్స్ తమ ఆయుధాలూ, కిట్లూ సర్దుకున్నారు. అందరూ అన్నీ సర్దుకున్న తరువాత నిపందిళ్ళకు ప్పంటించి కూలదోశారు.

తరువాత అందరం వరుసగా నిలుచున్నాం. ఒకటి, రెండు, మూడు ...ఒకరి తరువాత ఒకరు నంబర్లు చెప్పుకున్నారు. వెనుకా ముందూ పైలెట్లు నడువగా 32 మందితో కూడిన ఆ సాయుధ రైతు గెరిల్లా దళం క్యాంపును మరోచోటికి మార్చడానికి ప్రస్థానం సాగించింది !

గుట్టలూ, రాళ్ళూ, రప్పలూ, బండలూ, చెట్లూ, తీగలూ, మహావృక్షాలూ—దాటుతూ, ఎక్కుతూ, దిగుతూ, దళంతోపాటు నేనూ ముందుకు సాగుతూన్నాను.

అంతలో వ్యవసాయ భూముల్లోకి వచ్చాం.

ఒక రైతు పొలంలో పనిచేసుకుంటూ కనుపించాడు. అందరితో కరచాలనం చేసి లాల్‌సలామ్ చెప్పాడు. వారంరోజుల క్రితం వడగళ్ళవాన కురిసింది. పంటలకు నష్టం కలిగింది. వెంటనే పార్టీ నష్టపరిహారాన్ని డిమాండ్ చేస్తూకర పత్రాన్ని పంచింది. మూడురోజుల క్రితం తహసీల్దారు, పోలీసులూ వచ్చి, వడగండ్ల వర్షానికి

దెబ్బతిన్న పంటలకు, రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించి వెళ్ళారు. ఈ విషయాన్ని ఆ రైతు, కో ఆర్డినేటర్ కామ్రేడ్ అరుణ్‌కు చెప్పాడు. పార్టీ ఆ ప్రాంతంలో పని చేయడం ప్రారంభించాక ప్రభుత్వోద్యోగులు ఒళ్ళు దగ్గరపెట్టుకు పని చేస్తూన్నారని పించింది.

అన్నలు కల్సినప్పుడు, ఆదివాసీ రైతులు అన్ని విషయాలూ చెప్తారు. ముఖ్యంగా పోలీసుల అనుపానుల్ని గురించి, వాళ్ళు ఎప్పుడు వచ్చింది, ఎటు పోయింది, ఎంతమంది వచ్చింది, ఎందుకోసం వచ్చింది-అన్నీ చెప్తారు ! అదే పోలీసులు ఊళ్ళోకి వస్తే, ఎవరూ పలకరు. ఒక్క సమాచారం చెప్పరు ! ఒక్క గ్లాసు నీళ్ళు ఇవ్వరు ! దీన్ని బట్టి ఈ పోలీసు రాజ్యాన్ని, తుపాకి రాజ్యాన్ని ప్రజలు ఎంతగా ద్వేషిస్తూన్నారో అర్థం అవుతుంది ! ఈ దొంగ నోట్ల, దొంగ ఓట్ల ప్రభుత్వాలు ప్రజలకు ఎంత దూరం అన్యాయో, దళాలూ, పార్టీ కామ్రేడ్లూ ప్రజల హృదయాల్లో ఎంతటి చెరగని స్థానాన్నేర్పరచుకున్నారో అర్థం అవుతుంది !

మరికొంత దూరం నడిచాక అడవిలోనే ఒక రోడ్డు తగిలింది. దాన్ని దాట వల్సి వచ్చింది. కో ఆర్డినేటర్ కామ్రేడ్ అరుణ్ హెచ్చరిక మేరకు అందరం పేర్లల్ పొజీషన్‌లో లైనుకట్టి నిలబడ్డాం. పైలెట్లు ఇద్దరూ అటూ-ఇటూ వున్నారు. అరుణ్ ముందు వున్నాడు.

దళం మొత్తం ఓ లిప్తకాలంలో రోడ్డును దాటి అవతలవైపున వున్న అడవి లోకి ప్రవేశించింది. మళ్ళీ సింగిల్ లైన్ పొజీషన్‌కు వచ్చాం. మళ్ళీ అడవి నడక ప్రారంభం అయింది.

మరో గంటసేపు నడిచి, మేము దాదాపు 20 రోజులపాటు క్యాంపు వేయ వల్సిన ప్రదేశాన్ని చేరుకున్నాం.

5

అదొక ఎండిపోయిన కొండవాగు. రాళ్ళూ, రప్పలూ, బండలూ, చిన్నా పెద్దా చెట్లూ, తీగలూ, అటూ ఇటూ ఎత్తైయిన పర్వతాలూ—రమణీయమైన ప్రకృతి శోభ !

దాదాపు 40 కిలోమీటర్ల పొడవుంటుందా కొండవాగు. అందులో దళం మకాం వేసింది.

అందరూ చేరుకున్నాక ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు. కొందరు తీగలూ - పొదలూ నరికి ప్రదేశాన్ని శుభ్రం చేయసాగారు. కిచన్ డ్యూటీ పడ్డ

కామ్రేడ్లు నాస్తా తయారుచేయడంలో మునిగిపోయారు. నలుగురు కామ్రేడ్స్ పందిళ్ళు వేయడంలో మునిగిపోయారు. కో ఆర్డినేటర్ అరుణ్ తన రాతపని చూసు కుంటున్నాడు. తారాచంద్ ఎదురుగా వున్న కొండ కింది భాగాన్ని శుభ్రం చేసుకు కూమని తన పని చేసుకుంటున్నాడు. తారాచంద్ ఎప్పుడూ హడావిడిగా వుంటాడు. ఎప్పుడూ ఏదో పనిలో మునిగి వుంటాడు.

మహిళా గెరిల్లాలూ పనులు చేస్తూన్నారు.

నీటి ఒనరులో ఆకులూ అవీ పడివున్నాయి. నీరు అపరిశుభ్రంగా వుంది. ఆకులూ అవీ పడివుండడం వల్ల పైనించీ వచ్చే నీటి జాలు ఆగిపోయింది!

మహిళా గెరిల్లా కామ్రేడ్ ప్రార్థన నిలవ నీటిని ఎత్తి పోసింది నీటి జలకు అడ్డుగా వున్న చెత్తా చెదారాన్ని తొలగించింది. ఇంక నీటిజాలు జల జల రాసాగింది. శుభ్రమైన చల్లనైన నీరు సమృద్ధిగా లభించింది.

*　　　*　　　*

అప్పటికి పొద్దూకిపోయింది. రెండు లాంతరులు వెలిగించారు. కొందరు కొవ్వొత్తులు పెట్టుకు రాసుకోవడమో, చదువుకోవడమో చేస్తూన్నారు.

అజయ్, రాజారావు, సోమయ్య, సుహాస్, నేనూ, సహర్ష ఒక పందిట్లో కూర్చుని వున్నాం. మా పందిట్లోనూ లాంతరు ఒక వెలిగించి పెట్టారు. సోమయ్య, సుహాస్ – మెకానిక్కులు మైన్స్, గ్రనేడ్స్ నింపడం, అన్నిరకాల ఆయుధాలనూ బాగు చేయడం చేస్తుంటారు. అప్పుడు....తో మైన్స్ నింపుతూన్నారు. ఔనుమరి ! మేమక్కడ 20 రోజులు వుంటాము. శత్రువు నుండి రక్షణ అవసరం కదా !

మాటల సందర్భంలో, ఆ రోజు సాయంకాలం నేనూ, సహర్ష చూసిన తేనె పట్టుల విషయం వచ్చింది. అడవి తేనెటీగలు చాలా ప్రమాదకరమైనవని సోమయ్య చెప్పాడు.

ఇంతలో అజయ్ తమ అనుభవాన్ని ఒకదాన్ని ఇలా చెప్పాడు.

"తొమ్మిదిమంది గల మా దళం అడవిలో ప్రయాణిస్తోంది. అప్పుడు పగలు మూడు గంటలయింది. ఆకాశం మబ్బు మబ్బుగా వుంది. అప్పటి వరకూ నడిచి ఓ నీటి వనరును చేరాము. అందరి దగ్గరా ఆయుధాలు వున్నాయి. కమాండరు దగ్గర ఎ.కె. 47 వుంది. అందరం బాగా అలసిపోయాం. ఉదయం నుండి ఏమీ తినలేదు.

దాదాపు 15-20 కిలోమీటర్ల దూరం నుండి నడిచి వచ్చామేమో ఆకలి అలసటా ముప్పిరిగొంటున్నాయి! అలసట బాపుకోడానికి స్నానం చేయాలనిపించింది: అందరికీ!"

" మా కిట్లూ, ఆయుధాలూ అక్కడున్న చెట్టుకింద పెట్టుకున్నాం! ముందు ఇంత టీ పెట్టుకు తాగటం అగత్యం అనిపించింది! టీ తాగి స్నానం చేయవచ్చు అనుకున్నాం! ఆ తరువాత వంట!....ఒక కామ్రేడు ట్రాన్సిస్టర్ని ఆన్ చేశాడు. ఏదో శాస్త్రీయ సంగీతం సాగుతోంది. అది! మరో కామ్రేడు నాలుగు పుల్లలు ఏరుకువచ్చి, మూడు రాళ్ళ పొయ్యి ముట్టించాడు. పొయ్యి ఏ చెట్టుకింద ముట్టించామో ఆ చెట్టుపైన సరీగా నడినెత్తిన తేనెతుట్టె పుండడాన్ని మేమెవరమూ గమనించలేదు! పొయ్యి రాజుకుంటోంది. పొగపైకి లేస్తోంది. ఇంక చూడండి ... తేనెటీగలు మా అందరి చుట్టూ మూగాయి. తెగ పొడిచేస్తూన్నాయి. వాటినుండి రక్షణ పొందడానికి మేము మా కిట్లూ ఆయుధాలూ వదిలి పారిపోయాం! దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకూ అవి మమ్మల్ని తరిమాయి! అలా పరుగెత్తి, ఎలాగో వాటి బారినుండి తప్పించుకుని, చీకటిపడ్డ తరువాత, రెండు జల్లులుపడ్డ అనంతరం, ఇంక ఫరవా లేదన్న నమ్మకం కలిగాకనే—అక్కడికి వెళ్ళి మా ఆయుధాల్నూ, సామాన్లనూ, కిట్లనూ తెచ్చుకున్నాం!"

రాజారావు "ఎండలో వాటికి పౌరుషం ఎక్కువ! పొగను చూస్తే రెచ్చిపోతాయి. తేనెటీగలు కుడితే మనిషి చచ్చిపోవడమూ కద్దు!" అన్నాడు.

కామ్రేడ్ అజయ్—ఒక సి.ఐ.డి.ని చంపిన విషయం చెప్పాడు.

"ఆ సి.ఐ.డి. పేర మధ్యప్రదేశ్ ప్రభుత్వం 20 వేలు బ్యాంకిలో వేసింది. మనల్ని పట్టించాక మరో పదివేలు ఇచ్చేట్టు వప్పందం! వాణ్ని పట్టుకుని, అడవికి తీసుకువచ్చి, బాగా దంచి చెట్టుకు కట్టేశాము. వాడి నోటిమీదుగానే మనల్ని పట్టించడానికి వాడు చేసిన పనులను చెప్పించాము. ప్రభుత్వం వాడికి ఎంత ఇస్తానన్నదో కూడా చెప్పాడు. ఆ తరువాత మరణశిక్షను విధిస్తూన్నట్టు చెప్పి చంపేశాము!"

అప్పుడే కో ఆర్డినేటర్ అరుణ్ అటుగా వచ్చాడు.

"వాడి చివరికోర్కెను అడిగితెల్సుకుని, తీర్చి మరీ చంపేశాం! చివరికోర్కె—బీడీ కాల్చాలని వుంది—అన్నాడు! బీడీ ఇచ్చి, కాల్చిన తరువాత చంపేశాం!" అన్నాడు.

ఆ సి.ఐ డి.కి మరణశిక్షను స్వయంగా అమలు జరిపిన 20 ఏళ్ళ కామ్రేడ్ అజయ్ గర్వంగా రొమ్మువిరచుకుని—

"మధ్యప్రదేశ్ ప్రభుత్వం కన్నంలో తేలు కుట్టినట్టు నోరుమూసుకు పూరుకుంది! కనీసం తమ సి.ఐ.డి.ని నక్సల్స్ చంపేశారనయినా ప్రకటించలేదు!" అన్నాడు.

6

ఎండిపోయిన కొండవాగులోకి క్యాంపును మార్చి రెండు రోజులు గడిచాయి. ఆ వాగు మొత్తం 40 కిలోమీటర్ల పొడవు వుంటుంది. కోట్ల సంవత్సరాల క్రితం ఆ రెండు పర్వతాలూ ఒకే పర్వతంగా కల్సివుండి వుంటాయి. అనంత కాలాల నుండి కురిసిన వర్షాలూ, నీటి వురవడి ప్రచండమైన ఝంఝూ పవనాల తీవ్ర ఆఘాతాలూ అక్కడో వాగును సృష్టించాయి. కొండయొక్క నడిభాగం చీలి వాగుగా పరివర్తన చెందడానికి ఎన్ని కోట్ల సంవత్సరాలు పట్టిందో ?

క్యాంపు దగ్గరనుండి వంద మీటర్ల దూరం వరకే వాగు కనబడుతోంది. అవతల ఏముందో కనబడనంత దట్టంగా చెట్లూ, చేవలూ అల్లుకుని వున్నాయి.

మార్చి నెల రెండవ భాగం చివరకు వచ్చింది. ప్రకృతిలో వసంతాగమన లక్షణాలు కనిపిస్తున్నాయి. గాలిలో సువాసనలు అలుముకున్నాయి. సీతాకోక చిలుకలు సందడించాయి. కొన్ని చెట్లు ఆకులు రాల్చేసి మోడులయ్యాయి. మరి కొన్ని చెట్లు కొత్త ఆకులు తొడిగి నూతన యుగారంభానికి స్వాగతం పలుకుతూ న్నాయి. ఇంకొన్ని చెట్లు ఇప్పుడిప్పుడే ఆకులు రాల్చేయడం ప్రారంభించాయి. నిరంతరం చెట్లనుండి కిందకు రాలిపడుతూన్న పండుటాకుల దృశ్యం నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం ప్రాణాలర్పిస్తోన్న అమరవీరుల త్యాగాలను స్ఫురణకు తెస్తోంది!

అప్పుడు ఉదయం ఎనిమిది గంటలయింది. స్వచ్ఛమైన, తెల్లనైన సూర్య కాంతి పరిసరంలో పరచుకుంటోంది.

ఆ రోజు తారాచంద్, వినోద్, జయపాల్ - ముగ్గురు కామ్రేడ్స్ బయటకు వెడుతూన్నారు. అందరి దగ్గరకూ వెళ్ళి కరచాలనంచేసి, లాల్‌సలామ్ చెప్పి సెలవు తీసుకుంటున్నారు. బయటకు వెళ్ళే కామ్రేడ్స్, బయటనుండి వచ్చిన

కామ్రేడ్స్ అలా కరచాలనం చేసి లాల్‌సలామ్ చెప్పడం ఆచారం ! ఎందుకంటే: బయటకు వెళ్ళిన కామ్రేడ్స్ తిరిగి రావచ్చు, లేక శత్రువు చేతచిక్కి అమరులు కావచ్చు ! అందువల్ల తోటి కామ్రేడ్స్ దగ్గర ఆ విధంగా వీడ్కోలు పుచ్చుకుని వెడతారు. అలాగే, బయటనుండి వచ్చాక తిరిగి కలుసుకున్న ఆనందంలో కర చాలనం చేసి లాల్‌సలామ్ చెబుతారు.

అలా బయటకు వెళ్ళిన ముగ్గురు కామ్రేడ్స్ మర్నాడు ఉదయం క్యాంపుకు తిరిగి వచ్చారు. వారితోపాటు మరో ఇద్దరు కొత్త కామ్రేడ్సు వచ్చారు. ఆ ఇద్దరూ ఫారెస్టు కమిటీలో బాధ్యత గల నాయకులు. ఒకరు ఆదర్శ, మరొకరు సంజయ్ !

వీరితోపాటు సాహిత్యం, ఆయుధాలు, అవసరం అయిన ప్రేలుడు పదార్థాలు కూడా వచ్చాయి.

వీరి రాకతో గెరిల్లా కామ్రేడ్స్ అందరిలోనూ సంచలనం, సంభ్రమం కలి గాయి ! అందరూ వస్తువుల్ని, సాహిత్యాన్ని, హిందీ తెలుగు దినపత్రికల్ని తీసుకు చూస్తున్నారు. తారాచంద్ మొత్తం సాహిత్యాన్ని తాను తీసుకుని అడిగినవాళ్ళకు- జంగ్, క్రాంతి, రాడికల్ మార్చి, అరుణతార, సృజన, ప్రభాత్, ఇండియా టు డే, ఫ్రంట్ లైన్ - ఇస్తున్నాడు !

సోమయ్య, సుహాస్ - ప్రేలుడు పదార్థాలనూ, ఆయుధాలనూ చూసుకుంటు న్నారు. కొత్త తుపాకులు, రైఫిళ్ళు, ఎ. కె. 47 - చాలా వచ్చాయి. వాటన్నిం టినీ, సరిచూసి, బాగుచేసి రెడీలో పెట్టాలి !

వీరితోపాటు ఛత్తీస్‌గఢ్ కామ్రేడ్ సోమనాథ్ వచ్చాడు. ఇతడు మంచికవి, హిందీలోనూ, ఛత్తీస్‌గఢ్ బోలీలోనూ కవిత్వం రాయగలడు.

తను కొత్తగా రాసిన 'చమక్‌తీ తల్వార్' అనే కవిత్వంలోని కొన్ని చర ణాల్ని పాడి వినిపించాడు.

మరో 50 ఏళ్ళు దాటిన కామ్రేడూ వచ్చాడు, వీళ్ళతోపాటు అతణ్ని అందరూ దాదా కామ్రేడ్ అని పిలిచేవారు.

అక్కడున్న మొత్తం గెరిల్లా కామ్రేడ్స్‌లో నాలుగు భాషలు మాట్లాడేవాళ్ళు న్నారు. తెలుగు, గోండీ, మరాఠీ, ఛత్తీస్‌గఢీ - ఐతే, ఒకరిద్దరు మినహా అందరూ

హిందీ మాట్లాడగలరు ! చదువు విషయంలో ఆరవ తరగతినుండి - డిగ్రీ వరకు చదివిన వాళ్ళున్నారు. ప్రార్థన - మహిళా గెరిల్లా, టీచర్ ట్రయినింగ్ అయి రెండు సంవత్సరాలు, టీచర్ వుద్యోగం చేసి, ఆ వుద్యోగాన్ని వదిలి - నూతన ప్రజాస్వామిక విప్లవంలో తన పాలు కర్తవ్యాన్ని నిర్వహించడానికి దళాల్లోకి వచ్చింది !

దళారి బూర్జువా, భూస్వామ్య స్వభావంగల ఈ దేశ దోపిడీ పాలక వర్గాలతో ప్రాణాలొడ్డి పోరాడుతూ, క్రూర నిర్బంధానెదుర్కొంటూ ఎర్రసేన నిర్మాణ దిశగా ముందుకు సాగుతూన్న రైతు గెరిల్లా దళాలివి ! ఈ గెరిల్లా దళాల్లో, వ్యవసాయిక విప్లవం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలన్న తమ ఆశయానికి తగినట్టుగానే అనుశాసనబద్ధమైన జీవితాన్ని చూశాను.

అప్పటికి నేను దళాల పరిచయంలోకి వచ్చి వారం గడిచింది. అక్కడున్న మొత్తం 36 మంది కామ్రేడ్స్‌లోనూ 7 గురు మహిళా కామ్రేడ్సున్నారని మొదటే చెప్పాను ! వారందరూ వివాహితలని తరువాత తెల్సింది. కొందరి భర్తలు అక్కడే వున్నారనీ తెల్సింది. ఐనా, ఎవరు ఎవరి భర్తలో ? ఎవరు ఎవరి భార్యలో తెల్సుకోలేకపోయాను. చర్యలద్వారా గానీ, మాటలద్వారా గానీ, చూపులద్వారా గానీ - భార్యాభర్తల సంబంధాన్ని బయటపడనీయకుండా వాళ్ళు వ్యవహరించే తీరు అపూర్వం అనిపించింది ! సాధారణ జీవితాల్లో, భార్యాభర్తల్ని - ముఖ్యంగా యువకత్వంలో వున్నవార్ని - ఇట్టే పసికట్టవచ్చును. కానీ, గెరిల్లా జీవితంలోని దంపతుల్ని తెల్సుకోవడం అంత తేలికయిన విషయం కాదు. 25 సంవత్సరాలలోపు వయసు కలిగిన భార్యాభర్తలు చేత, మాట, చూపుల్లో సహితం అంతటి సంయమనాన్ని పాటించడం - బయటి జీవితంలో చూడలేని ఓ అపూర్వమైన విషయం !

7

ఆదర్శ, సంజయ్‌లు - వచ్చాక నాలుగు రోజులపాటు, అక్కడున్న రెండు గెరిల్లా దళాలకు విడివిడిగా సమావేశాలు జరిగాయి.

ఆ సమావేశాలు జరుగుతున్న రోజుల్లోనే భారత్ బంద్‌ను (మార్చి 26-27 తారీకుల్లో) దృష్టిలో పెట్టుకుని పోలీసులు చుట్టుపట్ల గ్రామాల్లోని 'దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజదూర్ సంగఠన' (DAKMS) కార్యకర్తల్ని అరెస్టుచేసి తీసుకెళ్ళారు. అలా అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసుల్ని స్త్రీలు అడ్డగించారనీ, లాఠీ

ఛార్జిలో ఒక వృద్ధురాలి చేయి విరిగిందనీ తెల్సింది. చుట్టుపట్ల గ్రామాలనుండి ఎప్పటికప్పుడు వార్తలందుతూండేవి. తమ కార్యకర్తల్ని విడిపించుకోడానికి ప్రజలు పోలీసుస్టేషన్‌కు ఊరేగింపుగా వెళ్ళారనీ, ఆ వూరేగింపులో, కాంగ్రేసు, బి. జె. పి. కార్యకర్తలు కూడా పాల్గొన్నారనీ తెల్సింది.

దోపిడీవర్గ ప్రభుత్వాల, వాటి పోలీసుల అత్యాచారాల గురించి కమాండర్ జయన్న ఇలా చెప్పాడు—

"కాంగ్రేసు, తెలుగుదేశం, బి. జె. పి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ పార్టీ పరిపాలించినా - ఆ పరిపాలన ప్రజల శత్రువే ! ఆ పాలకులు పెట్టుబడి దార్ల, బూర్జువాల, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ ప్రజల్ని లాఠీలతో, తూటాలతో అణచడానికే ప్రయత్నిస్తారు. మరో విషయం: ఏ పార్టీ పరిపాలించినా అణచివేత విధానంలో మాత్రం వ్యత్యాసం వుండదు ! తెలుగుదేశం అధికారంలో వుంటే - కాంగ్రేసు, మొసలికన్నీరు కారుస్తూ - ప్రజలమీద పోలీసుల అత్యాచారాలు పెరిగిపోయాయంటుంది. ఇంక కాంగ్రేసు అధికారానికి వస్తే, తెలుగు దేశం ఏ మాత్రం సిగ్గు-బిడియం లేకుండా అదే పాట పాడుతుంది ! ఇంక బి జె పి. పాలన ఎంతటి ప్రజా వ్యతిరేకో, ప్రజలమీద ఎంతటి క్రూరమైన అణచివేతనూ, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదో ఒక్క ఉదాహరణ చెబితే సరిపోతుంది ! మధ్య ప్రదేశ్ (బి. జె. పి. పాలన) పోలీసులు, ఆదివాసీ రైతులను రకరకాల బాధలు పెట్ట డమే కాకుండా, పరజవాద గెరిల్లా దళం ఆచూకీ చెబితే పదివేల రూపాయలు బహుమతి ఇస్తామని రైతులకు ఆశ చూపారు ! పోనీ, ఆచూకీ చెప్పనవసరం లేదు, అన్నలు అన్నం అడగడానికి వచ్చినప్పుడు, మేము విషం ఇస్తాం, దాన్ని అన్నంలో కలిపి వాళ్ళకు పెట్టండి. వాళ్ళు చనిపోయాక మీకు బహుమతి ఇస్తామని ఆశ చూపారు ! పోలీసులు అలా చెప్పి వెళ్లిన మర్నాడే దళం ఆ వూరు వెళ్లింది. పోలీ సులు చూపిన ఆశ గురించి అన్నలకు చెప్పడమే కాదు, ఆ పూట అన్నలకు కమ్మని భోజనాన్ని వండిపెట్టారు ! ఎంతో చదువుకుని, సుఖకరమైన జీవితాన్ని వదిలి, ఎన్నో కష్టాలు పడుతూ తమకోసం పోరాడుతూన్న అన్నల్ని చంపుకోవడమన్న మాట తలచుకుని విలవిల్లాడిపోయారు—రైతులు !"

— (కొరవ వచ్చే సంచికలో)

విరసం విశేషాలు

'అనంతపురం జిల్లా యూనిట్' అనంతపురంలో జూలై 2న 'చెర' వర్ధంతిని నిషేధ వ్యతిరేక సభగా జరిపింది. కా॥ అరుణ్ అధ్యక్షత వహించిన సభలో కా॥ దివి చెరబండరాజు ఆశయాలు నేడు రచయితలందరికీ ఎలా శిరోధార్యాలో వివరించారు. వాల్మీకి నాటినుండి నేటి వరకు రచయితలు వర్గ ప్రయోజనాలకు తమ సృజనాశక్తిని వినియోగించారని సోదాహరణగా వివరించారు. కాకపోతే వారంతా పాలకవర్గ ప్రయోజనాలకు రచనలు చేస్తే నేడు విప్లవ రచయితలు ప్రజా పోరాటాలకు, పేద ప్రజల ఆశలను, ఆవేశాలను ప్రతిబింబిస్తూ సమర్థిస్తూ రచనలు చేస్తున్నారని, అందుకే వీరిపై లాఠీలు, తూటాలు, అరెస్టులు కొనసాగుతున్నాయన్నారు. నేడు తెలంగాణా ప్రజలపై రక్కసి రాజ్యం పాలిస్తుందని, మహబూబ్‌నగర్ జిల్లాలో పాత్రికేయుల్ని, ఉపాధ్యాయుల్ని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఈ స్థితిలో నోరు విప్పడం ప్రతి మేధావి బాధ్యత అని, పీపుల్స్‌వార్ రాజకీయాల్ని అంగీకరించనివారుకూడా ఆ పార్టీపై నిషేధాన్ని ఖండించాలని, యిది కనీస ప్రజాస్వామ్య బాధ్యత అని రచయితలకు, మేధావులకు గుర్తు చేశారు. ప్రజలపట్ల తమ నిబద్ధతను కొనసాగిస్తూ అత్యంత నిర్బంధాలను యెదుర్కొనైనా సరే విరసం రచనలు చేస్తుందని చెరబండరాజు ఆశయాల్ని కొనసాగిస్తామని హామీ యిచ్చారు.

ఏమంటాడు ?

మేం తిండి లేదు మొర్రో అంటే
వాడు రష్యా నుండి రాకెట్ పరిజ్ఞానాన్ని తెస్తానంటాడు.
మేం భూమి లేదు బాబోయ్ అంటే
వాడు ముందు రామ జన్మభూమి సంగతి తేలాలంటాడు.
మేం బతుకు చూపమంటే
వాడు స్టార్ టీవీలో ఒలింపిక్స్ చూడమంటాడు.
మేం అడవి మీద హక్కడిగితే
వాడు టైగర్ జోన్స్ వుంటే చాలంటాడు.
మేం సంఘాలు పెట్టుకుంటే
వాడు నిషేధం అంటాడు.
మేం టైగర్ జోన్స్ స్థానే గెరిల్లా జోన్స్ నిర్మిస్తున్నాం.
ఇక ఇప్పుడేమంటాడు ?

— కంభాల శ్రీనివాసరావు



కా॥ నూతన్ అమర్ హై !

విరసం సభ్యుడు, కవి, సి. పి. ఐ. (ఎం ఎల్.) కార్యకర్త కా॥ నూతన్‌ను జూన్ 25 వ తేదీన మంచిర్యాలలో పోలీసులు కాల్చి చంపేశారు. విప్లవ కార్యకర్తగానే గాక, అనేక కవితలు, పాటలు రాసి ప్రజలకు ఉత్తేజాన్నిచ్చే విప్లవ రచయితగా గుర్తింపు పొందాడు. విప్లవోద్యమంపై, విప్లవ రచయితలపై పోలీసుల హింసాకాండకు ఇదొక నిదర్శనం మాత్రమే. పోలీసుల ఈ దుశ్చర్యను విరసం తీవ్రంగా ఖండిస్తోంది. కా॥ నూతన్‌కు జోహార్లర్పిస్తోంది.

— వి. చెంచయ్య
కార్యదర్శి, విరసం

విరసం సభ్యుల అక్రమ అరెస్టులు

విరసం సభ్యుడు APTF నాయకుడు, అధ్యాపకుడు అయిన కా॥ గంగాధర్‌ను జూన్ మొదటివారంలో అరెస్టుచేసి, చిత్రహింసలకు గురి చేశారు. చివరకు కోర్టులో హాజరు పర్చి అక్రమ కేసు పెట్టారు. కండిషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

విరసం కార్యవర్గ సభ్యుడు, మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ కా॥ ఉదయ్‌ని జూన్ 5న అరెస్టు చేసి 6న వదిలారు. మహబూబ్‌నగర్ టౌన్‌లో విప్లవకారులు ఏ చర్యకు తలపడ్డా మీరే బాధ్యులని పోలీసులు బెదిరించారు.

విప్లవ రచయితల్ని ఇలా అక్రమంగా అరెస్టు చెయ్యడం, చిత్రహింసలు పెట్టడం, బెదిరించడం ముఖ్యంగా తెలంగాణా జిల్లాలలో నిత్యకృత్యమైపోయింది. పోలీసుల ఈ చట్ట వ్యతిరేక చర్యల్ని విరసం తీవ్రంగా ఖండిస్తోంది.

విరసం కార్యవర్గ సభ్యురాలు కా॥ విమల భర్త సి. పి. ఐ. (ఎం. ఎల్.) రాష్ట్ర కమిటీ సభ్యుడు కా॥ కృష్ణారెడ్డి జూన్ 6వ తేదీన అనారోగ్యంతో మరణించాడు. ఈ అకాల మరణానికి విరసం తన సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది.

* * *

విరసం సభ్యుడు, ప్రకాశం జిల్లా కన్వీనర్ కా॥ రుద్రజ్వాల భార్య కస్తూరి జూన్ 3వ తేదీన అనారోగ్య కారణంగా మరణించింది. ఆమె మృతికి విరసం సంతాపం తెలియజేస్తోంది.

—విరసం

(చివరి పేజీ కొరవ)

తెలంగాణా మంత్రమ్మ వీడు
వాడి పేరే సంతోషరెడ్డి
వీడి పదవీ ఆర్థికమంత్రి
ముఖ్యమంత్రీ లంచాల్లో వీడు
పాపు వాటా గొడుతుంటాడు ॥ముఖ్య॥
గోతిగాడి గుంటనక్కలా వీడు
కాలేజి కోసమూ కాచుకోనున్నాడు
॥చదువు॥

ప్రజల మాంసాన్ని యిటుకలు జేసి
కట్టుకున్నా విజయానగరం
ఏలుతున్నా దొకడు రాజు
కూలుతున్నా ప్యాలలు బూజు
వాడు భూపతి రామా రాజూ
వాడు పార్టి మారుతున్నాడూ ॥వాడు॥
తెలుగుదేశం నుంచి కాంగిలోకి దూరి
వైద్య కాలేజీకి ఎగబడుతున్నాడు
॥చదువు॥

అన్నన్నా ! ఒకసారి జూడు
చదువునమ్మే బాడ్కావు లీళ్ళు
పూర్లల్లో గూండాలు వీళ్ళు
రాజకీయాల్లో పిండార్లు వీళ్ళు
పూరుకున్నాము ఈ రోజు అంటే
రేపు ప్రజలను పీక్కుతింటారు ॥పూరు॥
లంచాల రాజ్యాన్ని లొంగదీయాలంటే
పోరులోన నువ్వు ముందుండి నడవాలి
॥చదువు॥

("తుపాకి రాజ్యంలో రన్నా"....బాణీలో)

— శ్రీనివాసమూర్తి

కలం కవాతు

1

బుద్ధపైన పొంగిలిస్తే
బడితపూజ జేస్తరు
బ్యాంకులనే కొల్లగొడితే
వంగి దండ మెడతరు
ఘరానా దొంగలకే
ఇచటున్నది స్థానం
గరీబోడు నిలుపుకొంటె
పోలునో యి ప్రాణం

2

స్వతంత్రమా నీ గానం
చేయలేను క్షమించు
నా గొంతుకు అడ్డముంది
పెను అకలి ఉచ్చు
దొంగలు దొంగలు కలిసి
పంచుకొంద్రు ఊర్లు
తెల్లోళ్ళు నల్లోళ్ళగ
మార్చుకొంద్రు పేర్లు

3

స్వతంత్ర్యాన్నె అమ్ముకొంటె
చదువేం దొక లెక్క
నిజం గురూ గద్దెమీద
ఉన్నదొక గుంట నక్క
'అందినకాడికి అందినంత
అమ్ముకొంద్ర దేశాన్ని
వల్లకాడు చేసెదాక
వదలకంద్ర జనాన్ని'

— జీవని

52

KLVA106M107

140 ARUNATARA AUGUST 1992 H/GTR-70
Annual Subscription Rs. 50/- Single issue Rs. 5/-

పాట :

చదువు

చదువు నీ జన్మహక్కు రన్న
దాన్ని అమ్మె మొనగాడెవ్వరన్న !
॥చదువు॥

అన్నన్న మాయన్న
వీర విద్యార్థన్న
చదువునమ్మేటోని చదునుజేయరన్న
॥చదువు॥

వాడు సియ్యెమ్మె నేదురుమల్లి
రాజధానిలో రక్తాన్ని జల్లి
ముఖ్యమంత్రీ పదవినెక్కి
కోట్ల-రూపాయల లంచాలు మెక్కి
రెండు కండ్లకు కావర మెక్కి
సదువు సంతలో యాలముబెట్టి ॥రెండు॥
రాజకీయాలల్లో బ్రోకరు కొడుకీడు ॥రాజ॥
చదువూను బజార్లో బ్రోతల్‌ను జేసిండు
॥చదువు॥

వాడు మాగుంట సుబ్బరామిరెడ్డి
వాడు బ్రాందీని అమ్ముతుంటాడు
వాడు పేపరును అమ్ముకుంటాడు
సారయాలాలు పాడుతుంటాడు
రాజకీయాలు మాట్లాడుతాడు ॥సార॥
వీనికి కాలేజి చదువు నప్పాజెబితే
చదువునంత కలిపి పెగ్గుల్లా అమ్మేను
॥చదువు॥

వీడు కొణజేటి రోశయ్య శెట్టి
దొడ్డిదారిన అసెంబ్లి నెక్కి
తిన్నయింటింటి వాసాలు ఎంచి
పదవి కోసము కిరికిరి బెట్టి
పార్టి మార్పుటాలో వీడు జెట్టి ॥పద॥
దంతా కళాశాల నమ్మి చేతులొ బెడితే
నట్టేటముంచేను పళ్ళూడగొట్టేను॥చదువు॥
ఒకడు నడిచేటి బాంబుల బట్టీ
వాడు జె.సి. దివాకరరెడ్డి
కరువు నిండిన రాసీమ బుట్టి
డొక్కలెండిన రైతుల గొట్టి
రొడ్డు భవనాల పదవిని గొట్టె ॥డొక్క॥
రాకాసి రాబందుకు వైద్య కాలేజిస్తే
శవాలను పుచితంగా సప్లయ్యి జేసేను
॥చదువు॥

అన్న ఆదోని కాలేజి జూడు
కొట్ల విజయ భాస్కరరెడ్డి పేరు
రెడ్డి పేరు వింటె ఎంత గొప్ప
పేరు వెనకాలుంది పెద్ద దిబ్బ
పెద్ద గూండాలు ట్రస్టుమెంబర్లూ
ట్రస్టు చేర్మేను ఎమ్మెల్యేగాడు ॥పెద్ద॥
వీళ్ళ కాలేజీలో వైద్యాము జదివితే
డాక్టర్లు గాకున్న హంతకులు అవుతారు
॥చదువు॥

(కొరవ 3 వ కవర్‌లో)

Printed at Nagendra Press, VJA-2 on behalf of Venkataramana Printers Guntur-1 Revolutionary Writers' Association

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M107
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	gagamma
స్కాన్ చేసినది	Priyatha
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good